మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

సోమవారం MONDAY 10-8-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 | సంచిక: 42 Issue: 42

09 ఆగస్టు 2026 - ఆదివారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - గ్రీష్మ ఋతువు ఆషాఢ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:01 సూర్యాస్తమయం - సా. 6:41 తిథి ఏకాదశి ఉ. 11:04 వరకు తరువాత ద్వాదశి సంస్కృత వారం భాను వాసరః నక్షత్రం మృగశిర మ. 2:40 వరకు తరువాత ఆరుద్ర యోగం హర్షణ రా. 1:59ం వరకు కరణం బాలవ ఉ. 11:04 వరకు కౌలవ రా. 9:32 వరకు వర్జ్యం రా. 10:19 నుండి రా. 11:46 వరకు దుర్ముహూర్తం సా. 5:00 నుండి సా. 5:51 వరకు రాహుకాలం సా. 5:06 నుండి సా. 6:41 వరకు యమగండం మ. 12:21 నుండి మ. 1:56 వరకు గుళికాకాలం మ. 3:31 నుండి సా. 5:06 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:25 నుండి తె. 5:13 వరకు అమృత ఘడియలు ఉ. 6:41 నుండి ఉ. 8:08 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:56 నుండి మ. 12:46 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial




# పెద్ది లేకున్నా.. పెద్దన్నగా నేనున్నా!

## కుటుంబ సభ్యులకు కేసీఆర్ భరోసా... పిల్లలను అక్కున చేర్చుకుని కంటతడి

### పెద్ది తల్లికి ధైర్య వచనాలు.. రూ.2.25 కోట్ల చెక్కుల అందజేత

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వరంగల్ జిల్లా నల్లబెల్లిలో పర్యటించారు. ఇటీవల అనారోగ్యంతో కన్నుమూసిన నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి దశదినకర్మ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించి, వారికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పార్టీ ప్రకటించిన రూ.2.25 కోట్ల ఆర్థిక సాయానికి సంబంధించిన చెక్కులను కేసీఆర్ స్వయంగా సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులకు అందజేశారు.

వరంగల్/నల్లబెల్లి, ఆగస్టు 9 (ఈవార్తలు): నల్లబెల్లిలోని నివాసానికి చేరుకున్న కేసీఆర్, తొలుత సుదర్శన్‌రెడ్డి చిత్రపటానికి నివాళు లర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడారు. సుదర్శన్‌రెడ్డితో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుని కేసీఆర్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. సుదర్శన్‌రెడ్డి అత్యంత సాదాసీదా జీవితం గడిపారని, తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన మంచి నేత అని కొనియాడారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని విచారం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ తరఫున ప్రకటించిన ఆర్థిక సాయంలో భాగంగా సుదర్శన్‌రెడ్డి ఇద్దరు పిల్లల పేరున చెరో రూ.1 కోటి, ఆయన తల్లి అమృతమ్మ సంరక్షణ కోసం రూ.25 లక్షల చెక్కులను కేసీఆర్ అందించారు. పిల్లల చదువులు, భవిష్యత్తుతో తరువాయి 2 వ పేజీలో...

# హైదరాబాద్‌లో 40 లక్షల ఓట్లు గల్లంతు?

## ఓటర్ల జాబితా సర్వేతో భారీ మార్పులు!

### సొంతూరిలో ఓటు హక్కుకే వలసదారుల మొగ్గు

### సనత్‌నగర్‌లో అత్యధికంగా 45 శాతం ఓట్ల రద్దుకు అవకాశం

### ఆగస్టు 17న విడుదల కానున్న ముసాయిదా ఓటర్ల జాబితా



హైదరాబాద్ నగరంలో ఓటర్ల సంఖ్యలో భారీ మార్పులు చోటుచేసుకోబోతున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సర్వే కారణంగా గ్రేటర్ పరిధిలో ఏకంగా 40 లక్షల ఓట్లు జాబితా నుంచి తొలగిపోయే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. రేపటితో ఈ సర్వే కార్యక్రమం ముగియనుండగా, నిన్నటి వరకు ఉన్న సమాచారం ప్రకారం రాజధానిలోని మూడు జిల్లాల పరిధిలో ఉన్న 28 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 1.14 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు.

హైదరాబాద్, ఆగస్టు 9 (ఈవార్తలు): వీరిలో దాదాపు మూడో వంతు ఓట్లు రద్దయ్యే సూచనలు కనిపిస్తుండటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ సెలవులు ఉన్నప్పటికీ ఆది, సోమవారాల్లో బూత్ స్థాయి అధికారుల (బీఎల్‌ఓ) నుంచి ఉన్నతాధికారుల వరకు విధుల్లోనే ఉంటారని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ స్పష్టం చేశారు. ఇప్పటివరకు ఎన్యుమరేషన్ ఫారాలను సమర్పించని ఓటర్లు ఎవరైనా ఉంటే వెంటనే అందజేయాలని ఆయన సూచించారు. క్షేత్రస్థాయిలో సర్వే పూర్తి చేసి, ఈ నెల 17న ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటించేందుకు అధికారులు వేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఓట్ల తొలగింపు ప్రభావం దాదాపు అన్ని నియోజకవర్గాల్లో ఉన్నప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో ఇది తరువాయి 2 వ పేజీలో...

# బోనమెత్తిన భాగ్యనగరం

### లాల్‌దర్వాజా మహంకాళికి భక్తుల బోనాలు

### అమ్మవారిని దర్శించుకున్న ప్రజాప్రతినిధులు

### హైదరాబాద్ నలుమూలలా వైభవంగా సంబురాలు



పాతబస్తీలోని ప్రసిద్ధ లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారి బోనాల జాతర ఆదివారం భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా జరిగింది. అమ్మవారి దర్శనం కోసం నగరం నలుమూలల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలిరావడంతో లాల్‌దర్వాజా పరిసరాలు కిక్కిరిసిపోయాయి. మహిళలు సంప్రదాయబద్ధంగా బోనాలు సమర్పించి అమ్మవారిని దర్శించుకున్నారు.

హైదరాబాద్, ఆగస్టు 9 (ఈవార్తలు): ఆషాఢ బోనాల ఉత్సవాల్లో భాగంగా మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ఎంపీలు అనిల్‌కుమార్ యాదవ్, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ అర్చకులు, దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ హైదరాబాద్ బోనాలకు తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు



బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,809 |
| వెండి (కిలో): | రూ.2,45,900 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,691 |

# భాగ్యలక్ష్మి ఆలయాన్ని గోల్డెన్ టెంపుల్‌గా మారుస్తాం

### సనాతన ధర్మ పరిరక్షణకు యువత ముందుకు రావాలి

### కేంద్ర మంత్రి బండి సంజయ్ పిలుపు

హైదరాబాద్ పాతబస్తీలో లాల్‌దర్వాజా బోనాల ఉత్సవాల సందర్భంగా కేంద్రమంత్రి బండి సంజయ్ లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి బంగారు బోనం సమర్పించిన బండి సంజయ్ ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే చార్మినార్ వద్ద ఉన్న భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయాన్ని గోల్డెన్ టెంపుల్‌గా అభివృద్ధి చేస్తామని బండి సంజయ్ కీలక ప్రకటన చేశారు.



చార్మినార్-హైదరాబాద్, ఆగస్టు 9 (ఈవార్తలు): పాతబస్తీలో బోనాల ఉత్సవాలను మరింత ఘనంగా నిర్వహించడంతో పాటు.. అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. ఉత్సవాల నిర్వహణకు

# వరుణదేవా.. కరుణించు!

నైరుతి రుతుపవనాల కాలం సగం దాటి ఆగస్టు రెండో వారంలోకి ప్రవేశించినా తెలంగాణకు జీవనాడులైన కృష్ణా, గోదావరి నదులకు స్థిరమైన ప్రవాహాలు ఇంకా పూర్తిస్థాయిలో అందడం లేదు. రాష్ట్రంలోని ప్రధాన జలాశయాలు పూర్తిస్థాయిలో నిండాలంటే తెలంగాణలో వర్షాలతో పాటు ఎగువన ఉన్న మహారాష్ట్ర, కర్ణాటకల్లోనూ విస్తారంగా వర్షాలు కురవాల్సిన పరిస్థితి ఉంది.

### నేడు సాగర్‌లో మహాయాగం.. 108 మంది రుత్వికులతో ప్రత్యేక క్రతువు

### పాల్గొననున్న సీఎం రేవంత్‌రెడ్డి.. 11 హోమగుండాలతో వైదిక కార్యక్రమం

### సాగర్‌లో ఇంకా 166.39 టీఎంసీల ఖాళీ.. భారీ ప్రవాహాల కోసం ఎదురుచూపు



హైదరాబాద్/నాగార్జునసాగర్, ఆగస్టు 9 (ఈవార్తలు): ఈ నేపథ్యంలో రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, కృష్ణా--గోదావరి నదులు పరవళ్లు తొక్కాలని ఆకాంక్షిస్తూ సోమవారం నాగార్జునసాగర్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా వరుణ యాగం నిర్వహించనుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ యాగంలో పాల్గొననుండగా, నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కార్యక్రమానికి నేతృత్వం వహించనున్నారు. తెలంగాణతోపాటు కృష్ణా, గోదావరి ఎగువ పరీవాహక ప్రాంతాల్లో సమృద్ధిగా, సకాలంలో వర్షాలు కురవాలని, నదులకు స్థిరమైన ప్రవాహాలు రావాలని, జలాశయాలు, చెరువులు నిండాలని, భూగర్భ జలాలు పెరగాలని, వ్యవసాయానికి సమృద్ధిగా నీరు అందాలని కోరుతూ ఈ యాగాన్ని నిర్వహిస్తున్నారు. 108 మంది తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



శరీరంలో తగినంత ద్రవం ని ఉండటం గుండె, రక్తనాళాల వ్యవస్థ సక్రమంగా పనిచేయడానికి చాలా అవసరం. రక్తంలోని ద్రవ భాగమైన ప్లాస్మా రక్త కణాలు సులభంగా ప్రవహించేలా చేస్తుంది. తద్వారా శరీరంలోని వివిధ భాగాలకు ఆక్సిజన్‌ను సమర్థంగా చేరవేయడంలో సహాయపడుతుంది. శరీరంలో నీటి పరిమాణం తగ్గినప్పుడు ప్లాస్మా పరిమాణం కూడా తగ్గుతుంది. దీంతో రక్తం సాధారణం కంటే గాఢంగా, చిక్కగా మారే అవకాశం ఉంటుంది. రక్తం చిక్కబడటంతో రక్తనాళాల్లో రక్త ప్రవాహానికి ఎదు-రయ్యే ప్రతిఘటన పెరుగుతుంది. అదే స్థాయిలో రక్త ప్రసరణను కొనసాగించేందుకు గుండె మరింత శ్రమతో రక్తాన్ని పంప్ చేయాల్సి వస్తుంది.



# పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్

రాష్ట్రవ్యాప్తంగా రాబోయే 24 గంటల్లో పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ మేరకు రాష్ట్రంలోని పలు జిల్లాలకు 'ఎల్లో అలర్ట్' జారీ చేస్తూ హెచ్చరికలు జారీ చేసింది.

# సీజేఐ రావొద్దు!

### నల్సార్ స్నాతకోత్సవానికి పిలవొద్దంటూ విద్యార్థుల నిరసన

### 450 మంది విద్యార్థులు సంతకాలు చేసి యాజమాన్యానికి లేఖ

### నీట్ నిరసనలపై సీజేఐ చేసిన వ్యాఖ్యలే అభ్యంతరాలకు కారణం



హైదరాబాద్, ఆగస్టు 9 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని ప్రతిష్ఠాత్మక నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా స్నాతకోత్సవానికి భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించడాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థులు నిరసన గళం విప్పారు. ఈ మేరకు దాదాపు 450 మంది విద్యార్థులు సంతకాలు చేసి విశ్వవిద్యాలయ యాజమాన్యానికి ఒక లేఖ రాశారు. ఈ పరిణామం తెలంగాణ న్యాయ విద్యా వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే, 2026 బ్యాచ్ స్నాతకోత్సవానికి సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించే ప్రతిపాదనను విద్యార్థులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఢిల్లీలో జరిగిన నీట్ నిరసనలపై సుప్రీంకోర్టులో జూలై 22న జరిగిన తరువాయి 2 వ పేజీలో...



# మెడికో ప్రియాంక కన్నుమూత

### ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్

### నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు

### కుటుంబానికి రూ.20 లక్షలు: చంద్రబాబు

తాగుబోతుల దాష్టీకానికి మెడికో ప్రియాంక ప్రాణం గాల్లో కలిసిపోయింది. కార్ టైర్ మెడ పైనుంచి ఎక్కేయడంతో బ్రెయిన్ డెడ్ అయ్యి.. మృత్యువుతో పోరాడి పోరాడి చివరికి ప్రియాంక శ్వాస ఆగిపోయింది. రాజమండ్రి మెడికో ప్రియాంక మృత్యువుతో పోరాడుతూ కన్నుమూసింది. సికింద్రాబాద్‌లో కిమ్స్‌లో చికిత్సపొందుతూ ఆదివారం మృతి చెందింది.

రాజమండ్రి/హైదరాబాద్, ఆగస్టు 9 (ఈవార్తలు): ప్రియాంక బ్రెయిన్ డెడ్ అయినట్టు వైద్యులు నిర్ధారించారు. మ. 3:22కి మృతిచెందినట్టు వైద్యులు ప్రకటించారు. ఇద్దరు వ్యక్తులు ఆగస్టు 3న రాత్రి మద్యంమత్తులో ప్రియాంకను కారుతో ఢీకొట్టారు.. అప్పటినుంచి ప్రియాంక తీవ్రగాయాలతో చికిత్స పొందుతోంది. తాగుబోతుల పైశాచికత్వానికి రాజమండ్రిలో గాయపడినప్పటి నుంచి మెడికో ప్రియాంక పరిస్థితి అత్యంత విషమంగానే -2 వ పేజీలో...

# రాశి ఫలాలు



10.8.2026

**మేషం:** చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. జీవిత భాగస్వామితో పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. బంధు మిత్రుల ఆదరణ పెరుగుతుంది. వృత్తి వ్యాపారాలలో ఆటుపోట్లు తొలగుతాయి. ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుకుంటారు.

**వృషభం:** వృత్తి ఉద్యోగాలలో మీ ప్రతిభా పాటవాలు వెలుగులోకి వస్తాయి. ఆప్తుల నుండి కీలక సమాచారం అందుతుంది. అనుకున్న పనులలో కార్యసిద్ధి కలుగుతుంది. నూతన వ్యాపారాలు విస్తరిస్తారు. నిరుద్యోగులు శుభవార్తలు అందుకుంటారు. ఆర్థిక పురోగతి కలుగుతుంది.

**మిథునం:** ఋణదాతల ఒత్తిడి పెరుగుతుంది. చేపట్టిన పనులు మందకోడిగా సాగుతాయి. తొందరపడి ఇతరులతో మాట్లాడటం మంచిది కాదు. ఆధ్యాత్మిక విషయాలపై దృష్టి సారిస్తారు. వృత్తి వ్యాపారాలలో ఆర్థిక నష్టాలు తప్పవు. ఉద్యోగమున అధికారుల ఆగ్రహానికి గురవుతారు. సంతాన అనారోగ్య సమస్యలుంటాయి.

**కర్కాటకం:** కుటుంబ వ్యవహారాలలో కీలక నిర్ణయాలు చేస్తారు. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి. సమాజంలో ప్రముఖుల సహాయంతో కొన్ని పనులు పూర్తి చేస్తారు. దూరపు బంధువుల ఆగమనంతో గృహమున సందడి వాతావరణం ఉంటుంది. వృత్తి, వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి.

**సింహం:** నూతన వాహన యోగం ఉన్నది. ఆర్థిక వ్యవహారాలు ఆశాజనకంగా ఉంటాయి. చేపట్టిన పనులలో అవరోధాలు అధిగమించి ముందుకు సాగుతారు. బంధు మిత్రులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. సోదరులతో స్థిరాస్తి వివాదాలు పరిష్కారమౌతాయి. వృత్తి వ్యాపారాలు మరింత ఉత్సాహంగా సాగుతాయి.

**కన్య:** పాత ఋణాలు తీర్చడానికి నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. కుటుంబ వ్యవహారాలలో ఆకస్మిక మార్పులుంటాయి. దూర ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. ఖర్చుకు తగినంత ఆదాయం ఉండదు. వృధా ఖర్చులు పెరుగుతాయి. వ్యాపారంలో భాగస్థులతో విభేదాలు కలుగుతాయి. వృత్తి ఉద్యోగాలలో అదనపు పని బారం తప్పదు.

**తుల:** ఆదాయ వ్యవహారాలు ఉత్సాహాన్నిస్తాయి. ఇంటా బయట విషయాలలో ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంటారు. కొన్ని వ్యవహారాలలో కుటుంబ సభ్యులు సలహాలు కలిసివస్తాయి. సేవా కార్యక్రమాలకు సహాయం అందిస్తారు. స్థిరాస్తి క్రయ విక్రయాలలో లాభాలు అందుకుంటారు. ఉద్యోగాలలో వివాదాలు పరిష్కారమవుతాయి.

**వృశ్చికం:** ముఖ్యమైన వ్యవహారాలు వ్యయప్రయాసలతో కాని పూర్తికావు. దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. అవసరానికి ధనం చేతిలో నిల్వ ఉండదు. నిరుద్యోగ ప్రయత్నాలు మందగిస్తాయి. కుటుంబ సభ్యులతో మాటపట్టింపులుంటాయి. ఆధ్యాత్మిక చింతన కలుగుతుంది. ఉద్యోగాలలో శ్రమ తప్పదు.

**ధనస్సు:** నూతన వ్యాపారాలు ప్రారంభిస్తారు. వృత్తి ఉద్యోగాలలో కష్టానికి తగిన ఫలితం పొందుతారు. నూతన గృహం కొనుగోలు ప్రయత్నాలకు ఆటంకాలు తొలగుతాయి. ధన పరంగా మరింత పురోగతి కలుగుతుంది. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. సంఘంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి.

**మకరం:** ఇంటా బయట మీ మాటకు విలువ పెరుగుతుంది. ఆకస్మిక ధనప్రాప్తి కలుగుతుంది. ఉద్యోగాలలో మీ నిర్ణయాలకు తగిన ప్రశంసలు అందుకుంటారు. గృహమున శుభకార్యములు నిర్వహిస్తారు. చిన్ననాటి మిత్రులతో విందువినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారమునకు పెట్టుబడులు అందుతాయి.

**కుంభం:** మీ ప్రవర్తన ఇతరులకు ఇబ్బంది కలిగిస్తుంది. వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. ఋణ దాతల ఒత్తిడి పెరుగుతుంది. ప్రయాణాలలో వాహన ప్రమాద సూచనలున్నవి. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలలో కొత్త సమస్యలు ఎదురవుతాయి. ఉద్యోగాలు నిరుత్సాహపరుస్తాయి.

**మీనం:** ఇతరులకు మాట ఇచ్చే విషయంలో జాగ్రత్త వహించాలి. పనులలో శ్రమ పెరుగుతుంది. ధనపరమైన ఇబ్బందులు తప్పవు. ఆరోగ్యం సహకరించక చికాకు పెరుగుతుంది. దూర ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. బంధు మిత్రులతో మనస్పర్ధలు కలుగుతాయి. వృత్తి ఉద్యోగాలలో చికాకులు ఉంటాయి.

# బోనమెత్తిన భాగ్యనగరం

మొదటి పేజీ తరువాయి

ప్రత్యేక చారిత్రక, సాంస్కృతిక గుర్తింపు ఉందన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా బోనాల ఉత్సవాలను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. హైదరాబాద్ బోనాల కోసం ప్రభుత్వం రూ.20 కోట్లు కేటాయించిందని తెలిపారు. సింహవాహిని మహంకాళి ఆలయంతో పాటు పరిసర ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వివిధ శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేశారని చెప్పారు. చివరి భక్తుడికి కూడా అమ్మవారి దర్శనం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అమ్మవారి ఆశీస్సులతో తెలంగాణ సుభిక్షంగా ఉండాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి రైతాంగం అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ హైదరాబాద్ బోనాల నిర్వహణకు ప్రభుత్వం రూ.20 కోట్లు కేటాయించిందన్నారు. రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో పటిష్ఠమైన ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలు, రైతులు సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. అనంతరం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్. నంద్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అమ్మవారికి బంగారు బోనం సమర్పించి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గద్వాల విజయలక్ష్మి, ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, పోలీస్ కమిషనర్ సజ్జనార్, డీసీపీలు, ఆర్డీవో రామకృష్ణ, వివిధ శాఖల అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

### లాల్‌దర్వాజా మహంకాళికి భక్తుల బోనాలు

పాతబస్తీలోని ప్రసిద్ధ లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారి బోనాల జాతర ఆదివారం భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా జరిగింది. అమ్మవారి దర్శనం కోసం నగరం నలుమూలల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలిరావడంతో లాల్‌దర్వాజా పరిసరాలు కిక్కిరిసిపోయాయి. మహిళలు సంప్రదాయబద్ధంగా బోనాలు సమర్పించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆషాఢ బోనాల ఉత్సవాల్లో భాగంగా మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ఎంపీలు అనిల్‌కుమార్ యాదవ్, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ అర్చకులు, దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ హైదరాబాద్ బోనాలకు ప్రత్యేక చారిత్రక, సాంస్కృతిక గుర్తింపు ఉందన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా బోనాల ఉత్సవాలను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. హైదరాబాద్ బోనాల కోసం ప్రభుత్వం రూ.20 కోట్లు కేటాయించిందని తెలిపారు. సింహవాహిని మహంకాళి ఆలయంతో పాటు పరిసర ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వివిధ శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేశారని చెప్పారు. చివరి భక్తుడికి కూడా అమ్మవారి దర్శనం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అమ్మవారి ఆశీస్సులతో తెలంగాణ సుభిక్షంగా ఉండాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి రైతాంగం అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ హైదరాబాద్ బోనాల నిర్వహణకు ప్రభుత్వం రూ.20 కోట్లు కేటాయించిందన్నారు. రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో పటిష్ఠమైన ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలు, రైతులు సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. అనంతరం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్. నంద్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అమ్మవారికి బంగారు బోనం సమర్పించి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గద్వాల విజయలక్ష్మి, ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, పోలీస్ కమిషనర్ సజ్జనార్, డీసీపీలు, ఆర్డీవో రామకృష్ణ, వివిధ శాఖల అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో 40 లక్షల ఓట్లు గల్లంతు?

మొదటి పేజీ తరువాయి

అత్యధికంగా ఉంది. ముఖ్యంగా సనత్‌నగర్ నియోజకవర్గంలో మొత్తం 2,54,030 ఓట్లు ఉండగా, వాటిలో ఏకంగా 1.16 లక్షల ఓట్లు (45.68%) రద్దయ్యే అవకాశం ఉందని అంచనా. అదేవిధంగా జూబ్లీహిల్స్‌లో 44.21%, ఎల్బీనగర్‌లో 42.19%, ఉప్పల్‌లో 40.05%, మహేశ్వరంలో 40.03% ఓట్లు జాబితా నుంచి తొలగిపోవచ్చని అధికారులు చెబుతున్నారు. అత్యల్పంగా ఇబ్రహీంపట్నంలో 21.43% ఓట్లు రద్దయ్యే అవకాశం ఉంది. రాబోయే రెండు రోజుల్లో ఈ సంఖ్యల్లో స్వల్ప మార్పులు మాత్రమే ఉండొచ్చని భావిస్తున్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఉపాధి, ఇతర అవసరాల కోసం ప్రతిరోజూ వేలాది మంది హైదరాబాద్‌కు వలస వస్తుంటారు. ఇక్కడే స్థిరపడి ఓటరుగా నమోదు చేసుకుంటారు. అయితే, ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఓటరు సర్వే జరుగుతున్న నేపథ్యంలో.. సొంత ఊరితో పాటు హైదరాబాద్‌లోనూ ఓటు హక్కు ఉన్నవారు తమ ఓటును సొంతూరిలోనే కొనసాగించేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో నగరంలో ఎన్యుమరేషన్ ఫారాలను చాలామంది అధికారులకు తిరిగి ఇవ్వలేదని తెలుస్తోంది. ఇదే ఓట్ల సంఖ్య భారీగా తగ్గడానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. మరోవైపు కొందరు అధికారుల నిర్లక్ష్యం కారణంగా తమకు ఇప్పటికీ ఎన్యుమరేషన్ ఫారాలు అందలేదని లక్షలాది మంది ఓటర్లు ఆరోపిస్తున్నారు. ఇలాంటి వారంతా ఆన్‌లైన్ ద్వారా తమ వివరాలను నమోదు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

# భాగ్యలక్ష్మి ఆలయాన్ని గోల్డెన్ టెంపుల్‌గా మారుస్తాం

మొదటి పేజీ తరువాయి

భారీగా నిధులు కేటాయిస్తామని తెలిపారు. ఈ క్రమంలోనే 2029లో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బోనాలను రాష్ట్ర పండుగగా ప్రకటించిన ప్రభుత్వం.. ఉత్సవాల నిర్వహణకు తగిన స్థాయిలో నిధులు కేటాయించడం లేదని బండి సంజయ్ తీవ్రంగా విమర్శించారు. లాల్‌దర్వాజా బోనాలకు ప్రభుత్వం కేటాయించిన నిధులు సరిపోవని పేర్కొన్నారు. ఇతర పండుగలకు కేటాయించే నిధులతో పోలిస్తే బోనాలకు తక్కువ ప్రాధాన్యం ఎందుకు ఇస్తున్నారని ప్రశ్నించారు. అలాగే గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆలయాల అభివృద్ధికి ఇచ్చిన హామీలు అమలు కాలేదని బండి సంజయ్ ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు హిందూ సమాజం, ఆలయాల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆయన విమర్శించారు. అయితే ఇవన్నీ తన రాజకీయ విమర్శలేనని.. హిందూ సమాజానికి సంబంధించిన అంశాలపై మాట్లాడటం తన బాధ్యతగా భావిస్తున్నానని పేర్కొన్నారు. సనాతన ధర్మ పరిరక్షణకు యువత ముందుకు రావాలని బండి సంజయ్ పిలుపునిచ్చారు. ముఖ్యంగా జెన్‌జీ తరం ఆధ్యాత్మిక, సామాజిక అంశాలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని బండి సంజయ్ పేర్కొన్నారు. ఆలయాల పరిరక్షణ, గోరక్షణ, హిందువుల భద్రత వంటి అంశాలపై తాను నిరంతరం మాట్లాడుతానని స్పష్టం చేశారు. చరిత్రను వాస్తవ కోణంలో భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందని కూడా తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాట యోధుల చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చడంపై ప్రశ్నలు సంధించారు. టిప్పుసుల్తాన్, అయోధ్య రామమందిరం వంటి అంశాలను ప్రస్తావిస్తూ కాంగ్రెస్ వైఖరిని విమర్శించారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యపై కూడా బండి సంజయ్ రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని నిలదీశారు. హైడ్రాలో పరిమిత సంఖ్యలో ఉద్యోగాల భర్తీకి నిర్వహించిన ఫిజికల్ టెస్ట్‌కు పెద్ద సంఖ్యలో యువత హాజరైన విషయాన్ని ప్రస్తావించారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఉద్యోగ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు నెలకు రూ.4 వేల భృతి ఇస్తామని ఇచ్చిన హామీని కూడా అమలు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం రోజ్‌గార్ మేళాల ద్వారా ఉద్యోగ నియామకాలు చేపడుతోందని పేర్కొన్నారు. బోనాల ఉత్సవాలకు రాజకీయాలకు సంబంధం లేదని.. తాను ప్రతి ఏడాది ఈ ఉత్సవాల్లో పాల్గొంటున్నానని బండి సంజయ్ తెలిపారు. ప్రజా సమస్యలపై బీజేపీ నిరంతరం పోరాడుతుందని పేర్కొన్నారు. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడితే ఆలయాల అభివృద్ధి, బోనాల నిర్వహణ, ప్రజా సంక్షేమం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తామని ఆయన స్పష్టం చేశారు.

# పెద్ది లేకున్నా.. పెద్దన్నగా నేనున్నా!

మొదటి పేజీ తరువాయి

పాటు కుటుంబ సంక్షేమ బాధ్యతలను పార్టీ నిరంతరం పర్యవేక్షిస్తుందని స్పష్టం చేశారు. కుటుంబానికి అన్ని విధాలా అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. కేసీఆర్ రాక సందర్భంగా నల్లబెల్లికి బీఆర్ఎస్ శ్రేణులు, నాయకులు, అభిమానులు భారీగా తరలివచ్చారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి నివాసం వద్ద జనం కిక్కిరిసిపోవడంతో స్వల్ప తోపులాట చోటుచేసుకుంది. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి, పరిస్థితిని అదుపులోకి తెచ్చి కేసీఆర్ కాన్వాయ్‌కు దారి కల్పించారు. కేసీఆర్ వెంట పలువురు పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

# వరుణదేవా.. కరుణించు!

మొదటి పేజీ తరువాయి

రుత్వికులు.. 11 హోమగుండాలు యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి చెందిన అర్చకులు, వేదపండితులు, ఆలయ సిద్ధాంతితో సంప్రదింపుల అనంతరం ఆగస్టు 10న వరుణ యాగం నిర్వహించేందుకు ముహూర్తం నిర్ణయించారు. నాగార్జునసాగర్‌లోని విజయవిహార్ ప్రాంగణంలో 11 హోమగుండాలను ఏర్పాటు చేస్తున్నారు. 108 మంది రుత్వికులు, అర్చకులు, వేదపండితులు రోజంతా ప్రత్యేక వైదిక క్రతువులు నిర్వహించనున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని, పంటలకు సాగునీటి కొరత తలెత్తకుండా కృష్ణా, గోదావరి నదులకు సమృద్ధిగా ప్రవాహాలు రావాలన్న సంకల్పంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

### ఎగువ రాష్ట్రాల వర్షాలే కీలకం

తెలంగాణ జలభద్రత కేవలం రాష్ట్రంలో నమోదయ్యే వర్షపాతంపైనే ఆధారపడి ఉండదు. కృష్ణా, గోదావరి నదుల ఎగువ పరీవాహక ప్రాంతాల్లో కురిసే వర్షాలు రాష్ట్రంలోని ప్రధాన ప్రాజెక్టులకు అత్యంత కీలకం. కృష్ణా నదీ పరీవాహక ప్రాంతం సుమారు 2.59 లక్షల చదరపు కిలోమీటర్లలో విస్తరించి ఉండగా, ఇందులో దాదాపు 44 శాతం కర్ణాటకలో, 27 శాతం మహారాష్ట్రలో ఉంది. అంటే కృష్ణా పరీవాహక ప్రాంతంలో 70 శాతానికిపైగా ఈ రెండు ఎగువ రాష్ట్రాల్లోనే ఉంది. కర్ణాటక, మహారాష్ట్రల్లోని పశ్చిమ కనుమలు, కృష్ణా, భీమా, తుంగభద్ర పరీవాహక ప్రాంతాల్లో కురిసే వర్షాలే ఆల్మట్టి, నారాయణపూర్ మీదుగా జూరాలకు, అక్కడి నుంచి శ్రీశైలం, నాగార్జునసాగర్‌కు వచ్చే ప్రవాహాలను ప్రధానంగా ప్రభావితం చేస్తాయి. గోదావరి విషయంలోనూ ఇదే పరిస్థితి. సుమారు 3.13 లక్షల చదరపు కిలోమీటర్ల గోదావరి బేసిన్‌లో దాదాపు 49 శాతం మహారాష్ట్రలోనే ఉంది. నాసిక్, మరాత్వాడాతోపాటు ఎగువ, మధ్య గోదావరి ప్రాంతాల్లో కురిసే వర్షాలు తెలంగాణలోని శ్రీరాంసాగర్, ఎల్లంపల్లి తదితర ప్రాజెక్టులకు వచ్చే ప్రవాహాలపై ప్రభావం చూపుతాయి. అందువల్ల రాష్ట్రంలో ఎంత వర్షం కురుస్తుందన్నదానితోపాటు మహారాష్ట్ర, కర్ణాటకల్లో వర్షపాతం, ఎగువ జలాశయాల్లో నిల్వలు, అక్కడి నుంచి విడుదలయ్యే నీటిని నీటిపారుదల శాఖ నిరంతరం పర్యవేక్షిస్తోంది.

### కృష్ణాలో పెరుగుతున్న ప్రవాహాలు

ఆదివారం ఉదయం 9 గంటల నాటికి కృష్ణా ఎగువ ప్రాంతాల్లో ప్రవాహాలు ఆశాజనకంగా కనిపించాయి. ఆల్మట్టికి 1,05,332 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతుండగా 86,155 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. 129.72 టీఎంసీల స్థూల సామర్థ్యానికి గాను ఆల్మట్టిలో 113.71 టీఎంసీల నిల్వ ఉంది. నారాయణపూర్‌కు సుమారు 42 వేల క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా 18,654 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. తెలంగాణలోకి కృష్ణా ప్రవాహాలకు ముఖద్వారంగా ఉన్న జూరాలకు సుమారు 80 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. అక్కడి నుంచి 46,543 క్యూసెక్కులు విడుదలవుతున్నాయి. 9.66 టీఎంసీల సామర్థ్యానికి గాను జూరాలలో 8.07 టీఎంసీల నీరు నిల్వ ఉంది. శ్రీశైలంలో 215.807 టీఎంసీల స్థూల సామర్థ్యానికి గాను 179.90 టీఎంసీల నీరు ఉంది. ఇంకా సుమారు 35.91 టీఎంసీల ఖాళీ సామర్థ్యం ఉంది.

### మిగిలిన రుతుపవనాలే కీలకం

రాష్ట్రంలో వ్యవసాయ అవసరాలకు సీజన్ మొత్తంలో వర్షాల విస్తరణ అత్యంత కీలకమని నీటిపారుదల వర్గాలు భావిస్తున్నాయి. ఒకటి, రెండు భారీ వర్షాలతోనే సాగునీటి అవసరాలు పూర్తిగా తీరవు. పంటలకు వివిధ దశల్లో తేమ అవసరం. చెరువులకు వరుస ప్రవాహాలు రావాలి. భూగర్భ జలాల పెరుగుదలకు నిరంతర వర్షాలు అవసరం. ప్రధాన జలాశయాలు నిండాలంటే ఎగువ పరీవాహక ప్రాంతాల నుంచి స్థిరమైన ప్రవాహాలు కొనసాగాలి. ఈ నేపథ్యంలో రుతుపవనాల మిగిలిన కాలంలో తెలంగాణతోపాటు మహారాష్ట్ర, కర్ణాటకల్లో విస్తారంగా వర్షాలు కురవడం రాష్ట్ర జలభద్రతకు కీలకంగా మారింది. ఈ పరిస్థితుల్లో జరుగుతున్న వరుణ యాగానికి ప్రాధాన్యం ఏర్పడింది. వర్షాలు పూర్తిగా ముఖం చాటేసిన పరిస్థితుల్లో కాకుండా, కృష్ణాలో ప్రవాహాలు క్రమంగా పెరుగుతున్నప్పటికీ అవి సీజన్ అంతటా స్థిరంగా కొనసాగుతాయా అన్నది ఇంకా స్పష్టత రాని సమయంలో ఈ యాగాన్ని నిర్వహిస్తున్నారు.

# మెడికో ప్రియాంక కన్నుమూత

మొదటి పేజీ తరువాయి

ఉంది. రాజమండ్రిలో చికిత్స అనంతరం.. ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి ఆమెను తరలించారు. అప్పటినుంచి ఆమెకు డాక్టర్లు ఆమెకు చికిత్స అందిస్తున్నారు. ప్రియాంకకు ఇప్పటికే అప్నియా టెస్ట్ చేయాలని వైద్యులు ప్రయత్నించినా, అందుకు ఆమె శరీరం సహకరించలేదని పేర్కొంటున్నారు. శరీరంలో సోడియం లెవల్స్ 16కన్నా తక్కువగా ఉండటం వల్లే ఇది సాధ్యం కాలేదన్నారు. ఆమెను ఎలాగైనా కాపాడానికి డాక్టర్లు విశ్వప్రయత్నాలు చేసినప్పటికీ.. చివరకు ప్రియాంక బ్రెయిన్‌డెడ్ తో చనిపోయినట్లు వైద్యులు తెలిపారు.

వదిలిపెట్టొద్దు..ప్రియాంక తండ్రి వెంకటేష్

రాజమండ్రి పీఎస్‌కు ప్రియాంక తండ్రి వెంకటేష్ వెళ్లారు. ప్రస్తుతమున్న కేసులో సెక్షన్లు వీక్‌గా ఉన్నాయా, శిక్షలు పడేలా విచారణ జరుగుతుందా అన్నదానిపై ఆరా తీశారు. డీఎస్పీలు దేవరాజ్, సుభాష్‌తో కేసుపై చర్చించారు. ఇది ముమ్మాటికీ మర్డరేనని అన్నారు. తప్పతాగి ఇలాంటి యాక్సిడెంట్స్ చేసేవారిని వదిలిపెట్టకూడదని ఆగ్రహం వ్యక్తం చేశారు వెంకటేష్. ప్రియాంకను యాక్సిడెంట్ చేసిన దశ్వంత్, ఆంద్రూ జోసెఫ్ ఎడ్వర్డ్స్‌పై ఇప్పటికే హత్యాయత్నం కేసు నమోదు చేశామని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ కిషోర్ చెప్పారు. ఉద్దేశపూర్వకంగా వారిద్దరూ ప్రియాంకను ఢీకొట్టారని తెలిస్తే హత్యాయత్నం కేసును హత్యకేసుగా మారుస్తామని చెప్పారాయన. నిందితులను కస్టడీకి కోరుతున్నామన్నారు తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ. ఈ కేసులో ప్రమేయం ఉన్నవారందరినీ అరెస్టు చేస్తామన్నారు.

అసలేం జరిగిందంటే..

ఆగస్ట్ 3వ తేదీ రాత్రి.. రాజమండ్రిలోని ప్రసాద్ ఆదిత్య మాల్‌లో సినిమా చూసి బయటికొచ్చారు ప్రియాంక, ఆమె ఫ్రెండ్. మాల్ నుంచి రోడ్డు మీదకు వెళ్లే సమయంలో కొన్ని క్షణాలు ఆపారు. కారణం.. రోడ్‌పై ట్రాఫిక్ ఉండడం. బట్.. వెనక కారులో ఉన్న నామవరానికి చెందిన సురవరపు దుష్యంత్, లాలాచెరువుకు చెందిన ఆంద్రూ విలియం జోసెఫ్.. ప్రియాంక బైక్‌ను ఢీకొట్టారు. మొదట 'ర్యాష్ డ్రైవింగ్' కింద సెక్షన్లు పెట్టారు. అది నిర్లక్ష్యం కాదు, తెలిసి ఉద్దేశపూర్వకంగా చంపేందుకు చేసిన ప్రయత్నమని నిర్ధారణ కావడంతో ఎఫ్ఐఆర్‌లో కీలక సెక్షన్లను మార్చారు. ఉద్దేశపూర్వకంగా హత్యాయత్నం చేసినందుకు బీఎన్ఎస్ 308, హత్యాయత్నం కింద బీఎన్ఎస్ 110 సెక్షన్లు చేర్చారు. ప్రస్తుతం నిందితులు దుష్యంత్, ఆంద్రూ జోసెఫ్ ఇద్దరూ 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు.

### ప్రియాంక కుటుంబానికి రూ.20 లక్షలు

ప్రియాంక కుటుంబానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు రూ. 20 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించారు. ఆమె మరణ వార్త తనను తీవ్రంగా కలచివేసిందని, ఈ ఘటన అత్యంత విషాదకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం జిల్లా అధికారులతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రియాంక కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబానికి తక్షణమే రూ. 20 లక్షల సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ ఘటనపై తాను ఇప్పటికే జిల్లా అధికారులతో సమీక్షించానని గుర్తుచేశారు. ప్రమాదానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, వారికి కఠిన శిక్ష పడేలా చూడాలని స్పష్టం

# అడవితో అనుబంధం.. అభివృద్ధిలో అగ్రస్థానం

## గిరిజన బిడ్డలకు ప్రపంచస్థాయి అవకాశాలే లక్ష్యం.. గిరిజన సంక్షేమానికి రూ.18,745.16 కోట్ల కేటాయింపు

### అడవిని కాపాడుకుంటూనే ఆదివాసీల అభివృద్ధి.. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వెల్లడి

హైదరాబాద్, ఆగస్టు 9: అడవితో అనుబంధాన్ని, తమ మూలాలను కాపాడుకుంటూనే గిరిజన సమాజం అభివృద్ధిలో అగ్రస్థానానికి చేరుకోవాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆకాంక్షించారు. గిరిజనుల హక్కులు, ఆత్మగౌరవం, విద్య, ఉపాధి, ఆర్థికాభివృద్ధి, మహిళా సాధికారతతో పాటు వారి భాష, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. గిరిజన బిడ్డలు దేశంలోనే కాకుండా ప్రపంచ స్థాయిలో రాణించేలా అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని బంజారా భవన్‌లో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. 2026--27 ఆర్థిక సంవత్సరానికి ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధి కింద రూ.18,745.16 కోట్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. ఈ నిధులను గిరిజన ప్రాంతాల్లో విద్య, మౌలిక వసతులు, రహదారులు, తాగునీరు, విద్యుత్, భూమి అభివృద్ధి, నైపుణ్యాభివృద్ధి తదితర రంగాలకు వినియోగిస్తున్నామని చెప్పారు. ఒక గిరిజన గ్రామానికి రహదారి, ఒక ఇంటికి మంచినీరు, ఒక విద్యార్థికి నాణ్యమైన విద్య, ఒక యువకుడికి నైపుణ్యం, ఒక మహిళకు ఆదాయం, ఒక రైతు భూమికి సాగునీరు అందినప్పుడే బడ్జెట్‌కు నిజమైన అర్థం ఉంటుందని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతులను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్య, వైద్యం ప్రతి గిరిజన కుటుంబానికి అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అభివృద్ధి అంటే నగరాల్లో పెద్ద భవనాలు నిర్మించడం మాత్రమే కాదని, మారుమూల గిరిజన తండాలో ఒక కుటుంబం జీవితం సులభతరం కావడమే నిజమైన అభివృద్ధి అని పేర్కొన్నారు. ఇందిరా గిరి జల వికాసం ద్వారా గిరిజన రైతుల భూములకు నీటి వసతి కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని మంత్రి తెలిపారు. సౌరశక్తి, సౌర పంపుల వినియోగాన్ని పెంచడంతో పాటు తోటలు, ప్రత్యామ్నాయ పంటలు, భూమి ఉత్పాదకత పెంపునకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆదివాసీకి అడవి కేవలం ప్రకృతి సంపద కాదని, అది జీవనాధారం, సంస్కృతికి మూలం, భవిష్యత్తుకు భరోసా అని మంత్రి అన్నారు. అడవి అన్నం, ఔషధం, ఉపాధి, నీడ




అందించిందని తెలిపారు. ఆదివాసీ--అడవి బంధం చెట్టు--మనిషి సంబంధం కాదని, తల్లి--బిడ్డ అనుబంధమని అన్నారు. అడవిని కాపాడుకుంటూనే అభివృద్ధి సాధించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ అదనపు సంచాలకుడు సర్వేశ్వర రెడ్డి, గిరిజన పరిశోధన సంస్థ సంచాలకురాలు డాక్టర్ సముజ్వల, మ్యూజియం నిర్వాహకుడు డాక్టర్ డి. సత్యనారాయణ, గిరిజన సంక్షేమ శాఖ ప్రధాన ఇంజినీర్ ఎం. బాలు, ట్రైకార్ ప్రధాన నిర్వాహకుడు శంకర్ రావు, జీసీసీ ప్రధాన నిర్వాహకుడు ప్రతాప్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, గిరిజన సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు, కళాకారులు, ఉద్యోగులు, వివిధ గిరిజన సమాజాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.

## తండ్రీకొడుకులను లోపల వేసేవాళ్లం

**బాలినేని ఆరోపణలకు దామచర్ల కౌంటర్**

**ఒంగోలులో దామచర్ల వర్సెస్ బాలినేని**

ఒంగోలు, ఆగస్టు 9 (ఈవార్తలు): ఏపీలోని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి మధ్య మాటల యుద్ధం తారస్థాయికి చేరింది. తనపై బాలినేని చేసిన విమర్శలకు దామచర్ల తీవ్రస్థాయిలో బదులిచ్చారు. గత ప్రభుత్వ హయాంలో చేసినట్టు రౌడీయిజం చేస్తామంటే ఇప్పుడు కుదరదని హెచ్చరించారు. చేసిన ఆరోపణలపై అక్రమాలపై కాణిపాకంలో ప్రమాణం చేయగలరా అని సవాల్ విసిరారు. ఆదివారం ఒంగోలులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దామచర్ల మాట్లాడుతూ.. బాలినేని కూటమిలో ఉన్నారనే తాము ఇన్నాళ్లు మౌనంగా ఉన్నామని, కానీ ఆయన అమావాస్యకోసారి ఒంగోలు వచ్చి విమర్శలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. తనపై కరపత్రాలు పంపిణీ చేసింది బాలినేని అనుచరుడు మురళీయేనని, ఈ విషయం పోలీసుల విచారణలో కూడా తేలిందని స్పష్టం చేశారు. అదే తాము బాలినేనిపై కరపత్రాలు వేయాలనుకుంటే పుస్తకాలే సరిపోవని అన్నారు. గత ప్రభుత్వంలో తమపై 79 కేసులు పెట్టారని గుర్తుచేశారు. ఆనాడు బాలినేని పార్టీ మారకుండా ఉండుంటే ఈపాటికి తండ్రీకొడుకులిద్దరినీ లోపల వేసేవారని దామచర్ల తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కొందరు జనసేన ముసుగులో ఉంటూ వైసీపీ నేతల కోసం పనిచేస్తున్నారని పరోక్ష వ్యాఖ్యలు చేశారు. బార్ షాపుల సిండికేట్ ద్వారా తండ్రీకొడుకులు కోట్లు దండుకున్నారని, ఈ విషయంపై బాలినేని ప్రమాణం చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు తన వ్యక్తిత్వం ఏంటో తెలుసు కాబట్టే గత ఎన్నికల్లో 34,000 ఓట్ల మెజారిటీతో గెలిపించారని, బాలినేని తలకిందులుగా తపస్సు చేసినా అంత మెజారిటీ రాదని దామచర్ల అన్నారు. ప్రభుత్వ భూమిలో బాలినేని బంధువు కట్టిన విల్లాలను స్వాధీనం చేసుకొని, ఆ స్థలాన్ని వెంగముక్కలపాలెం ప్రజలకు కమ్యూనిటీ హాల్ కోసం కేటాయిస్తామని ఆయన ప్రకటించారు.

## దామచర్ల నేను రాజు నేనే మంత్రి అనుకుంటున్నారు

**ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌పై బాలినేని తీవ్ర ఆరోపణలు**

ఒంగోలు, ఆగస్టు 9 (ఈవార్తలు): అధికార కూటమిలోని భాగస్వామ్య పక్షాలైన తెలుగుదేశం, జనసేన మధ్య ప్రకాశం జిల్లా ఒంగోలులో విభేదాలు తారాస్థాయికి చేరాయి. ఒంగోలు నియోజకవర్గంలో టీడీపీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు, జనసేన నేత బాలినేని శ్రీనివాసరెడ్డి వర్గాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా వైరం ముదిరింది. తాజాగా ఎమ్మెల్యే దామచర్ల తీరుపై బాలినేని శ్రీనివాసరెడ్డి తీవ్రమైన అవినీతి ఆరోపణలు చేయడంతో ఈ వివాదం మరింత ముదిరింది. గత ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలై, ఆ తర్వాత జనసేనలో చేరిన బాలినేని శ్రీనివాసరెడ్డి.. ఎమ్మెల్యే దామచర్లపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "ఒంగోలు నియోజకవర్గంలో ఎమ్మెల్యే దామచర్ల అరాచకాలు పెరిగిపోయాయి. తానే రాజు, తానే మంత్రి అన్నట్లుగా ఆయన వ్యవహరిస్తున్నారు. ఆయన తీరుతో సొంత పార్టీ టీడీపీ కార్యకర్తలే ఇబ్బందులు పడుతున్నారు" అని బాలినేని ఆరోపించారు. తమ వారిపై అన్యాయంగా కేసులు పెడుతున్నారని, తప్పు చేయని తన వాళ్లను కాపాడుకోలేకపోతే తాను నాయకుడిగా ఉండి ఉపయోగం ఏంటని బాలినేని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతటితో ఆగకుండా, ఎమ్మెల్యేపై నేరుగా అవినీతి ఆరోపణలు చేశారు. "ఇసుక, మైనింగ్, వైన్‌లో ఎమ్మెల్యేకు వాటాలు ఉన్నాయి. ఆయనకు ప్రతిరోజూ మామూళ్లు అందుతున్నాయి. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే విచారణకు ఆదేశించాలి. అప్పుడే నిజానిజాలు బయటకు వస్తాయి" అని బాలినేని డిమాండ్ చేశారు. కూటమిలో పొత్తు ధర్మం పాటించాలనే ఉద్దేశంతోనే ఇన్నాళ్లూ తాము మౌనంగా ఉన్నామని, అయితే ఇకపై సహించేది లేదని ఆయన హెచ్చరించారు. "మా ఓపిక నశించింది. ఇకపై మేం, మా కార్యకర్తలు చూస్తూ ఊరుకోం. ఈ బహిరంగ ఆరోపణలతో ఒంగోలులో కూటమి నేతల మధ్య విభేదాలు వీధికెక్కాయి. స్థానిక నాయకుల మధ్య మొదలైన ఈ పోరు, రాష్ట్రస్థాయిలో కూటమి నాయకత్వానికి కొత్త తలనొప్పిగా మారే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## పైలట్ రోహిత్ రెడ్డిపై నాన్-బెయిలబుల్ వారెంట్

హైదరాబాద్, ఆగస్టు 9 (ఈవార్తలు): బీఆర్ఎస్ నేత, తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డికి హైదరాబాద్ కోర్టులో చుక్కెదురైంది. దాదాపు దశాబ్ద కాలం నాటి చెక్ బౌన్స్ కేసులో ఆయనను దోషిగా నిర్ధారిస్తూ, న్యాయస్థానం నాన్-బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. ఇంటెల్లిడెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థకు సంబంధించిన రూ. 34.23 లక్షల చెక్ బౌన్స్ కేసులో ఈ తీర్పు వెలువడింది. 2015లో రోహిత్ రెడ్డి ఆ కంపెనీలో డైరెక్టర్‌గా ఉన్న సమయంలో, సంస్థ వనరులను తన వ్యక్తిగత వ్యాపారాలకు వినియోగించి నష్టం కలిగించారనే ఆరోపణలు వచ్చాయి. ఈ వివాద పరిష్కారానికి ఇరుపక్షాల మధ్య కుదిరిన అవగాహన ఒప్పందంలో భాగంగా 2014 సెప్టెంబర్ 25న రోహిత్ రెడ్డి సదరు సంస్థకు చెక్కును అందజేశారు. అయితే, ఖాతాలో సరిపడా నిధులు లేకపోవడంతో ఆ చెక్ 2014 అక్టోబర్, డిసెంబర్ మధ్య మూడుసార్లు బౌన్స్ అయింది. దీనిపై సంస్థ పంపిన లీగల్ నోటీసులకు రోహిత్ రెడ్డి స్పందించకపోవడంతో వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ కేసుపై సుదీర్ఘ విచారణ జరిపిన హైదరాబాద్ మొదటి జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ (మున్సిపల్ కోర్టు), నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ యాక్ట్ సెక్షన్ 138 కింద రోహిత్ రెడ్డిని దోషిగా నిర్ధారించింది. తీర్పు వెలువడే సమయంలో రోహిత్ రెడ్డి కోర్టుకు హాజరుకాకపోవడంతో న్యాయమూర్తి ఆయనపై నాన్-బెయిలబుల్ వారెంట్ జారీ చేశారు.

## జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి ఆలయంలో చోరీ

**భక్తురాలి వెండి బిస్కెట్లు, డబ్బు మాయం**



జూబ్లీహిల్స్-హైదరాబాద్, ఆగస్టు 9 (ఈవార్తలు): హైదరాబాద్‌లో బోనాల పండుగ సందడి కొనసాగుతున్న వేళ జూబ్లీహిల్స్‌లోని ప్రముఖ పెద్దమ్మతల్లి ఆలయంలో బోనాల పర్వదినం సందర్భంగా జరిగిన దొంగతనం సంచలనం రేపుతోంది. ఆలయానికి వచ్చిన ఓ మహిళ బ్యాగ్‌ను గుర్తుతెలియని వ్యక్తి చాకచక్యంగా కోసి అందులోని పౌచ్‌ను అపహరించినట్లు పోలీసులు తెలిపారు. ఈ సంఘటనతో ఆలయానికి వచ్చిన భక్తుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. మియాపూర్‌లోని మాతృశ్రీనగర్ కాలనీకి చెందిన నాగలక్ష్మి వృత్తిరీత్యా టీచర్. ఈ క్రమంలోనే ఆదివారం ఉదయం సుమారు 10:30 గంటల సమయంలో ఆమె జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి ఆలయానికి వెళ్లారు. పూజలు చేస్తుండగా గుర్తుతెలియని వ్యక్తి ఆమె బ్యాగ్‌ను చాకచక్యంగా కోసినట్లు తెలుస్తోంది. ఆ తర్వాత బ్యాగ్‌లో ఉన్న పౌచ్‌ను తీసుకుని అక్కడి నుంచి తప్పించుకున్నాడు. తన బ్యాగ్‌లోని పౌచ్ కనిపించకపోవడంతో నాగలక్ష్మి ఆందోళనకు గురయ్యారు. పౌచ్‌లో ఐదు వెండి బిస్కెట్లతోపాటు రూ.5 వేల నగదు ఉన్నట్లు ఆమె పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో ఆ గందరగోళాన్ని ఉపయోగించుకుని నిందితుడు చోరీకి పాల్పడి ఉంటాడని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బాధితురాలు వెంటనే జూబ్లీహిల్స్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బాధితురాలి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు.. సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. నిందితుడి కదలికలను గుర్తించేందుకు ఆలయంలోని కెమెరాలతో పాటు పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ దృశ్యాలను కూడా చెక్ చేస్తున్నారు. ఆ సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా నిందితుడిని గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

## ఈ20 పెట్రోల్ చాలా మంచిది

**మండించి మరీ బీజేపీ ఎంపీ కొండా ప్రయోగం**

హైదరాబాద్, ఆగస్టు 9 (ఈవార్తలు): కేంద్ర ప్రభుత్వం పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలిపి.. ఈ20 పెట్రోల్ దేశవ్యాప్తంగా విక్రయిస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఈ20 పెట్రోల్ వాడటం వల్ల వాహనాలు పాడవుతున్నాయని, మైలేజీ తగ్గిపోతోందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే దేశవ్యాప్తంగా వాహనదారుల్లో తీవ్ర ఆందోళనలు వెల్లువెత్తుతున్నాయి. అయితే ఈ20 పెట్రోల్‌పై జరుగుతున్న ప్రచారాన్ని ఖండించిన బీజేపీ సీనియర్ నేత, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి.. ఆయనే స్వయంగా ఒక ప్రయోగం చేసి.. ఇథనాల్ పెట్రోల్ మంచిదని తేల్చి చెప్పారు. దేశంలో ఈ20 పెట్రోల్ గురించి దుష్ప్రచారం జరుగుతోందని.. దాన్ని ప్రజలకు వివరించేందుకే తాను ఈ ప్రయోగం చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ క్రమంలోనే తన వాహనం నుంచి తీసిన కొంత పెట్రోల్‌ను వినియోగించారు. ఇక ల్యాబ్‌లో కొనుగోలు చేసిన ఇథనాల్‌ను తీసుకొచ్చారు. విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న క్రూడాయిల్ నుంచి పెట్రోల్ తయారు అవుతుందని.. ఇక ఈ ఇథనాల్ మన దేశంలో పండిన పంటల నుంచి తయారు చేస్తారని వివరించారు.




ఈ నేపథ్యంలోనే ఒక గిన్నెలో కొంత పెట్రోల్, మరో గిన్నెలో ఇథనాల్ పోసిన ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి.. ఆ రెండు గిన్నెల్లో అగ్గిపుల్ల అంటించి మంట పెట్టారు. అయితే పెట్రోల్ ఉన్న గిన్నెలోని మంట నుంచి పొగ వెలువడింది. అదే సమయంలో ఇథనాల్ ఉన్న గిన్నెలోని మంట నుంచి ఎలాంటి పొగ వెలువడకుండా కేవలం మంట మాత్రమే రావడం కనిపించింది. దీంతో వాహనాల్లో పెట్రోల్ వాడితో పొగ బయటికి వచ్చి.. వాతావరణం కాలుష్యం అవుతుందని ఎంపీ కొండా వెల్లడించారు. అదే ఇథనాల్ వాడటం వల్ల అసలు పొగే రాదని పేర్కొన్నారు. ఇక ఆ రెండు గిన్నెల్లో మంట ఆరిపోయిన తర్వాత.. అందులో ఉన్న బూడిదను ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి చూపించారు. ఇథనాల్‌ను మండించిన గిన్నెలో టిష్యూ పేపర్‌ను ఉంచి బయటికి తీసినా ఎలాంటి బూడిద రాలేదు. అదే సమయంలో పెట్రోల్ మండించిన గిన్నెలో నల్లటి బూడిద కనిపించింది. అయితే మైలేజీతో పోల్చితే.. పెట్రోల్ కంటే ఇథనాల్ కలిపిన పెట్రోల్‌లో కొంత తగ్గుతుందని.. అది 3 శాతం వరకు మాత్రమే ఉంటుందని బీజేపీ ఎంపీ వెల్లడించారు. ఈ20 పెట్రోల్ వాడటం వల్ల వాహనాలు పాడవుతాయని చేస్తున్న ప్రచారం కూడా అసత్యమని తేల్చి చెప్పారు. బ్రెజిల్, అర్జెంటీనా వంటి దేశాల్లో పూర్తిగా 100 శాతం ఇథనాల్‌ను వాహనాల్లో వినియోగిస్తున్నారని స్పష్టం చేశారు. ఇథనాల్ వాడటం వల్ల మన రైతులకు, ఫ్యాక్టరీలకు లాభమని పేర్కొన్న ఎంపీ కొండా.. పెట్రోల్ వినియోగం వల్ల మనకు క్రూడాయిల్ ఎగుమతి చేస్తున్న దేశాలకు లాభమని, అదే సమయంలో పర్యావరణానికి కూడా నష్టమని తేల్చి చెప్పారు. దేశ ప్రజలు ఇది గమనించి.. వారు ఎటు వైపు ఉన్నారో ఆలోచించుకోవాలని కొండా విశ్వేశ్వర్ రెడ్డి సూచించారు.

## ఐక్యతే మన బలం

**క్విట్ ఇండియా స్ఫూర్తిపై పవన్ ట్వీట్**

హైదరాబాద్, ఆగస్టు 9 (ఈవార్తలు): క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తిని స్మరించుకుంటూ, ఆ మహోద్యమంలో పాల్గొన్న స్వాతంత్ర్య సమరయోధులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఘన నివాళులర్పించారు. శనివారం ఆయన 'ఎక్స్' వేదికగా ఈ మేరకు తన సందేశాన్ని పంచుకున్నారు. దేశ చరిత్ర గతిని మార్చి, భారతీయ ఆత్మను మేల్కొల్పిన మహోన్నత ఘట్టం క్విట్ ఇండియా ఉద్యమమని ఆయన కొనియాడారు. "1942 ఆగస్టు 8న మహాత్మా గాంధీ ఇచ్చిన 'డూ ఆర్ డై' (సాధించు లేదా మరణించు) పిలుపు కోట్లాది మంది భారతీయుల్లో అచంచలమైన దేశభక్తిని, ధైర్యసాహసాలను నింపింది. ఈ నినాదం స్వాతంత్ర్య పోరాటాన్ని ఉవ్వెత్తున ఎగసిన జాతీయోద్యమంగా మార్చింది" అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. మాతృభూమి విముక్తి కోసం ప్రాణత్యాగాలు చేసిన ఆ మహనీయులకు తాను శిరస్సు వంచి ప్రణమిల్లుతున్నట్లు తెలిపారు. భారతదేశ వాస్తవిక శక్తి ప్రజల ఐక్యతలో, సవాళ్లను అధిగమించాలనే సమష్టి సంకల్పంలోనే ఉందని ఈ ఉద్యమం మనకు గుర్తుచేస్తోందన్నారు. పటిష్టమైన, స్వయం సమృద్ధ, అభివృద్ధి చెందిన దేశాన్ని నిర్మించడం ద్వారానే ఆ వీరుల కలలకు, వారి త్యాగాలకు సరైన న్యాయం చేకూరుతుందని పవన్ కల్యాణ్ తన పోస్టులో వివరించారు.

## లాల్ దర్వాజా బోనాల్లో విజయ్ దేవరకొండ సందడి

హైదరాబాద్, ఆగస్టు 9 (ఈవార్తలు): హైదరాబాద్‌లో బోనాల పండుగ వేడుకలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. నగరంలోని అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండ పాతబస్తీలోని ప్రసిద్ధ లాల్ దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనతో పాటు సోదరుడు, నటుడు ఆనంద్ దేవరకొండ, ప్రముఖ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కూడా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. బోనాల పండుగ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన ఈ ముగ్గురూ అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని ఆశీస్సులు అందుకున్నారు. విజయ్ దేవరకొండ, సందీప్ రెడ్డి వంగా కలిసి ఆలయానికి రావడంతో అక్కడి వాతావరణం మరింత సందడిగా మారింది. తమ అభిమాన హీరో వచ్చాడని తెలుసుకున్న ఫ్యాన్స్, స్థానిక యువత ఆయన్ను చూసేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దర్శనం అనంతరం బయటకు వస్తున్న విజయ్ దేవరకొండను ఫోటోలు తీసేందుకు అభిమానులు ఎగబడ్డారు. దీంతో ఆలయ పరిసరాల్లో కాసేపు కోలాహలం నెలకొంది.



## తిరుమలలో భారీగా రద్దీ

తిరుమల, ఆగస్టు 9 (ఈవార్తలు): తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తడంతో కొండపై విపరీతమైన రద్దీ నెలకొంది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోయి, క్యూలైన్లు బయటకు విస్తరించాయి. గోగర్భం డ్యామ్ సర్కిల్ సమీపంలోని ఆక్టోపస్ భవనం వరకు భక్తులు కిలోమీటర్ల మేర బారులు తీరిన దృశ్యాలు కనిపిస్తున్నాయి. సర్వదర్శనం టోకెన్లు లేని భక్తులకు శ్రీవారి దర్శనానికి సుమారు 20 నుంచి 24 గంటల సమయం పడుతోందని అధికారులు వెల్లడించారు. నిన్న (ఆగస్టు 8) మొత్తం 87,658 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 40,606 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 4.13 కోట్లుగా నమోదైంది. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు 4.15 లక్షల లడ్డూలను విక్రయించగా, 3.09 లక్షల మందికి అన్నప్రసాదం అందించారు. వారాంతం కావడంతో భక్తుల రద్దీ అనూహ్యంగా పెరిగినట్లు తెలుస్తోంది. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు టీటీడీ అధికారులు తాగునీరు, ఆహారం వంటి సౌకర్యాలు కల్పిస్తూ రద్దీని క్రమబద్ధీకరించే ప్రయత్నాలు చేస్తున్నారు. భారీ రద్దీ నేపథ్యంలో, తిరుమలకు వచ్చే భక్తులు ఈ విషయాన్ని గమనించి తమ ప్రయాణాన్ని ప్రణాళిక చేసుకోవాలని టీటీడీ సూచిస్తోంది.

## నాపై నిరసనల వెనుక నవీన్ పట్నాయక్

**మాజీ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్**

జెన్-జీ విద్యార్థులను కొందరు తప్పుదోవ పట్టించారని ఆరోపణ

పాట్నా: నీట్ పేపర్ లీక్ వివాదంపై విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేసిన బీజేపీ సీనియర్ నేత, సంబల్‌పూర్ ఎంపీ ధర్మేంద్ర ప్రధాన్ తొలిసారిగా ఆ అంశంపై స్పందించారు. విద్యార్థులను (జెన్-జీ) తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరిగాయని, అందుకే తాను రాజీనామా చేశానని వెల్లడించారు. జులై 25న రాజీనామా చేసిన సరిగ్గా రెండు వారాల తర్వాత, భువనేశ్వర్‌లోని జీఎం యూనివర్సిటీలో విద్యార్థులు, ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "జెన్-జీ మన పిల్లలు. కొంతమంది వారిని తప్పుదోవ పట్టించాలని చూశారు. నాకు వ్యక్తిగతంగా ఎలాంటి సమస్యలు లేవు. పదవి నాకు ముఖ్యం కాదు. అందుకే ప్రధాని నరేంద్ర మోదీని కలిసి నా రాజీనామాను ప్రతిపాదించాను" అని ప్రధాన్ వివరించారు. భారతదేశంలో ప్రతి ఏటా రెండు కోట్ల మంది పిల్లలు పుడుతున్నారని, గడిచిన పదేళ్లలో 20 కోట్ల మంది జన్మించారని, వారి ఆకాంక్షలే దేశాన్ని 'విశ్వగురువు'గా నిలబెడతాయని ఆయన అన్నారు. మరోవైపు తన ఒడిశా పర్యటన సందర్భంగా బీజేడీ కార్యకర్తలు చేపట్టిన నిరసనలపై కూడా ప్రధాన్ తీవ్రంగా స్పందించారు.



VANGS
GLOBAL TECHNOLOGIES LLP
15 Days Free Trial
Launch Your Own Digital Newspaper Today
Complete ePaper & News Portal Solution
The Daily News
Global Economy Shows Strong Growth in 2024
City Marathon Sets New Record
BREAKING NEWS • BREAKING NEWS •
CLOUD HOSTING
ePaper Only Pricing
Starter
ePaper Only
10 GB Storage
₹17,999 / Year
★ Most Popular
Professional
ePaper Only
20 GB Storage
₹19,999 / Year
Enterprise
ePaper Only
30 GB Storage
₹21,999 / Year
News Module Add-on: +₹6,000 Extra
Includes full News Portal with all features
Powerful Features
Unlimited News
Unlimited Gallery
Unlimited Web Stories
Unlimited Traffic
SEO Ready
Custom Domain
Push Notifications
Single Click PDF Upload
ePaper Publishing
Breaking News
Live Updates
Custom Menu
Custom Theme
ID Card Designer
Employee News App
Category Management
Heat Track for News Reports & Admin
Multiple Language Support — Yes for All Platforms
ePaper Only Starting from
₹1,799 /month*
Book Free Demo
Start Your 15 Days Free Trial Today
https://vangstechnologies.com
hr@vangstechnologies.com
+91 7675087378



# బ్రహ్మోస్‌కు గిరాకీ

## కొనుగోలుకు ప్రపంచ దేశాల క్యూ
## ఉత్పత్తి పెంచిన రక్షణ శాఖ

భారత అమ్ములపొదిలోని బ్రహ్మోస్ సూపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణికి అంతర్జాతీయంగా గిరాకీ అమాంతం పెరిగింది. ముఖ్యంగా, 'ఆపరేషన్ సిందూర్' సమయంలో ఈ క్షిపణి చూపిన అద్భుతమైన పనితీరు, దాని కచ్చితత్వం, విధ్వంసక శక్తి ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించాయి.

ఈ ఆపరేషన్ తర్వాత బ్రహ్మోస్ కొనుగోలుకు పలు దేశాలు తీవ్ర ఆసక్తి చూపుతుండగా, ఇప్పటికే కొన్ని దేశాలతో భారీ ఒప్పందాలు కూడా ఖరారయ్యాయి. 'ది వీక్' పత్రిక ప్రచురించిన ఒక నివేదిక ప్రకారం, ఈ క్షిపణి కొనుగోలుకు చర్చలు వేగవంతమయ్యాయి. 2022 జనవరిలో ఫిలిప్పీన్స్‌తో 375 మిలియన్ డాలర్ల ఒప్పందం కుదుర్చుకున్న భారత్, ఆపరేషన్ సిందూర్ తర్వాత మరిన్ని విజయాలు సాధించింది.

న్యూఢిల్లీ: వియత్నాం సుమారు 629 మిలియన్ డాలర్ల ఒప్పందాన్ని ఖరారు చేయగా, ఇండోనేషియా కూడా 200 నుంచి 300 మిలియన్ డాలర్ల మధ్య విలువైన ఒప్పందాన్ని ఖరారు చేసుకుంది. యూరప్, పశ్చిమాసియా, లాటిన్ అమెరికా, ఆఫ్రికాకు చెందిన డజనుకు పైగా దేశాలు కూడా బ్రహ్మోస్ కొనుగోలుపై ఆసక్తి వ్యక్తం చేస్తున్నాయి. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే), పాకిస్థాన్‌లోని కీలక ఉగ్ర స్థావరాలపై భారత సైన్యం 'ఆపరేషన్ సిందూర్' నిర్వహించింది. ఈ ఆపరేషన్‌లో భాగంగా, భారత వాయుసేన విమానాలు అంతర్జాతీయ సరిహద్దు దాటకుండానే సుమారు 15 బ్రహ్మోస్ క్షిపణులను పాక్ సైనిక స్థావరాలపై ప్రయోగించాయి. ఈ దాడుల కచ్చితత్వం, తీవ్రత పాకిస్థాన్‌ను తీవ్రంగా దెబ్బతీశాయి. ముఖ్యంగా, పాకిస్థాన్ మోహరించిన చైనా నిర్మిత ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను బ్రహ్మోస్ విజయవంతంగా ఛేదించడం ఒక కీలక పరిణామం. ఈ క్షిపణి దాడుల ధాటికి తట్టుకోలేకే పాకిస్థాన్ వెంటనే కాల్పుల విరమణకు పిలుపునిచ్చిందని నివేదికలు పేర్కొంటున్నాయి. ఈ పరిణామమే బ్రహ్మోస్‌పై ప్రపంచ దేశాలకు నమ్మకాన్ని పెంచింది. పెరుగుతున్న దేశీయ, అంతర్జాతీయ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని భారత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని గణనీయంగా పెంచింది. హైదరాబాద్, నాగ్‌పూర్, పిలానీలతో పాటు ఇటీవల లక్నోలో కొత్తగా ప్రారంభించిన ప్లాంట్‌లో కూడా ఉత్పత్తి మొదలైంది. ప్రస్తుతం ఈ నాలుగు కేంద్రాల్లో నెలకు కనీసం నాలుగు క్షిపణులను తయారు చేసే సామర్థ్యం ఉండగా, దీనిని మరింత విస్తరించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. భారత నావికాదళంలోని ప్రతి ప్రధాన యుద్ధనౌక, వాయుసేనలోని ప్రతి ఫైటర్ జెట్‌ను బ్రహ్మోస్‌తో సన్నద్ధం చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. బ్రహ్మోస్ ప్రాజెక్టుకు 1997లో అంకురార్పణ జరిగింది. అప్పటి డీఆర్‌డీఓ చీఫ్ ఏపీజే అబ్దుల్ కలాం నేతృత్వంలోని ఇంటిగ్రేటెడ్ గైడెడ్ మిస్సైల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో భూమికి సమీపంగా ప్రయాణించే క్రూయిజ్ క్షిపణి లోటును గుర్తించారు. ఈ క్రమంలోనే రష్యాతో కలిసి బ్రహ్మోస్ అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. డీఆర్‌డీఓ, రష్యాకు చెందిన ఎన్‌పీఓ మషినోస్ట్రోయేనియా సంయుక్త భాగస్వామ్యంతో 'బ్రహ్మోస్ ఏరోస్పేస్' ఏర్పడింది. తొలినాళ్లలో 'పీజే-10' అనే కోడ్‌నేమ్‌తో అత్యంత



రహస్యంగా ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేశారు. మరోవైపు, బ్రహ్మోస్‌లో కొత్త వేరియంట్ల అభివృద్ధిపై కూడా శాస్త్రవేత్తలు దృష్టి సారించారు. నీటి అడుగున ప్రయోగించే సామర్థ్యమున్న వెర్షన్, తేలికైన మినీ వేరియంట్‌ను రూపొందించే పనులు కొనసాగుతున్నాయి. భవిష్యత్తులో పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో బ్రహ్మోస్‌ను తయారు చేసి, తేజస్, ఎల్‌సీఏ ఎంకే 2 వంటి దేశీయ యుద్ధ విమానాలకు అనుసంధానించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇది రక్షణ రంగంలో స్వావలంబన సాధించే దిశగా భారత్ చేస్తున్న ప్రయత్నాలకు మరింత బలాన్ని చేకూర్చనుంది.

## ఆంక్షలు ఎత్తేస్తేనే హర్మూజ్ ఓపెన్

అంతర్జాతీయ వాణిజ్యానికి అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధి విషయంలో ఇరాన్ తన వైఖరిని మరింత కఠినతరం చేసింది. అమెరికా తన ధోరణిని మార్చుకుని, తమ డిమాండ్లను అంగీకరించే వరకు జలసంధిని తెరిచే ప్రసక్తే లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ తాజాగా ఒక ప్రకటన విడుదల చేసింది.



టెహ్రాన్: అమెరికా తమపై బెదిరింపులకు పాల్పడటం ఆపాలని, నావికా దిగ్బంధనాన్ని పూర్తిగా తొలగించాలని ఇరాన్ డిమాండ్ చేస్తోంది. తమ దేశం నుండి సైన్యాన్ని ఉపసంహరించుకోవడంతో పాటు, యుద్ధం వల్ల జరిగిన నష్టానికి ఆర్థికంగా పరిహారం చెల్లించాలని షరతులు విధించింది. అలాగే, విదేశాల్లో స్తంభింపజేసిన తమ ఆస్తులపై ఉన్న ఆంక్షలను బేషరతుగా ఎత్తివేయాలని కోరుతోంది. జులైలో ఇరు దేశాల మధ్య కుదిరిన మధ్యంతర ఒప్పందం ప్రకారం, ఆంక్షల తొలగింపు, నష్టపరిహారం వంటి అంశాలపై తుది ఒప్పందంలో చర్చలు జరగాల్సి ఉంది. ఈ చర్చలకు నిర్దేశించిన 60 రోజుల గడువు మరో వారంలో ముగియనుంది. అయితే, ముందుగా హర్మూజ్ జలసంధిని తెరవడంపై ఒప్పందం కుదిరితేనే మిగతా అంశాలపై చర్చిస్తామని అమెరికా పట్టుబట్టడంతో ప్రతిష్ఠంభన కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో, గడువును పొడిగించే అవకాశం ఉన్నట్లు సమాచారం. మరోవైపు, హర్మూజ్ జలసంధి నిర్వహణ కోసం ఒమన్‌తో ప్రత్యేక ఒప్పందం కుదుర్చుకునే ప్రక్రియ తుది దశకు చేరుకుందని ఇరాన్ వర్గాలు తెలిపాయి. రవాణా మార్గంపై త్వరలోనే ఏకాభిప్రాయం కుదరవచ్చని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ ఆశాభావం వ్యక్తం చేశారు.

## మారుతి సుజుకి.. ఐదేళ్లలో 7 కొత్త ఎస్‌యూవీలు

న్యూఢిల్లీ: భారత ఆటోమొబైల్ రంగంలో అగ్రగామిగా ఉన్న మారుతి సుజుకి, తన స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకునేందుకు భారీ ప్రణాళికలతో ముందుకు వస్తోంది. మారుతున్న వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా, రాబోయే ఐదారు సంవత్సరాల్లో ఏకంగా 7 కొత్త స్పోర్ట్స్ యుటిలిటీ వెహికల్స్ (ఎస్‌యూవీ)ను మార్కెట్లోకి తీసుకురానున్నట్లు ప్రకటించింది. దీంతో పాటు, పెరుగుతున్న డిమాండ్‌ను అందుకునేందుకు ఇప్పటికే ఉత్పత్తి సామర్థ్యాన్ని 5 లక్షల యూనిట్ల మేర పెంచుకున్నట్లు వెల్లడించింది. సంస్థ 2025-26 వార్షిక నివేదికలో ఈ వివరాలను పొందుపరిచింది. మధ్యకాలిక వృద్ధిపై తమకు పూర్తి విశ్వాసం ఉందని, అందుకే ఉత్పత్తి సామర్థ్యాన్ని వేగవంతంగా విస్తరించామని కంపెనీ ఎండీ, సీఈఓ హిసాషి టేకుచి తెలిపారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలోనే 5




లక్షల యూనిట్ల అదనపు తయారీ సామర్థ్యాన్ని జోడించామని ఆయన వివరించారు. ఎస్‌యూవీ పోర్ట్‌ఫోలియోను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ కొత్త మోడళ్లను పరిచయం చేయనున్నట్లు స్పష్టం చేశారు. కంపెనీ ఛైర్మన్ ఆర్.సి. భార్గవ భారత కార్ల మార్కెట్ భవిష్యత్తుపై ఆశాభావం వ్యక్తం చేశారు. 2030-31 ఆర్థిక సంవత్సరం నాటికి దేశీయ ప్యాసింజర్ కార్ల పరిశ్రమ 6.1 - 6.3 మిలియన్ యూనిట్లకు చేరుకుంటుందని ఆయన అంచనా వేశారు. ముఖ్యంగా, గత ఐదేళ్లతో పోలిస్తే చిన్న కార్ల సెగ్మెంట్ కూడా గణనీయమైన వృద్ధిని నమోదు చేస్తుందని ఆయన పేర్కొన్నారు. మారుతీ సుజుకి ఇటీవల అద్భుతమైన పనితీరును కనబరిచింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో అత్యధికంగా 24.22 లక్షల వాహనాలను విక్రయించి రికార్డు సృష్టించింది. ఇందులో 4.47 లక్షల వాహనాల ఎగుమతులు కూడా ఉన్నాయి. వరుసగా మూడో ఏడాది 2 మిలియన్ల వార్షిక అమ్మకాల మార్కును దాటడం విశేషం. ఈ వృద్ధిని కొనసాగించేందుకు కంపెనీ బహుముఖ వ్యూహాన్ని అనుసరిస్తోంది. చిన్న కార్ల విభాగాన్ని పునరుద్ధరించడం, ఎస్‌యూవీ పోర్ట్‌ఫోలియోను విస్తరించడం, మల్టీ-పవర్‌ట్రెయిన్ వ్యూహం, ఎగుమతులపై దృష్టి పెట్టడం వంటివి ఇందులో భాగంగా ఉన్నాయి. వీటితో పాటు, పర్యావరణ హితమైన ఇంధనాలపై కూడా మారుతీ ప్రత్యేక దృష్టి సారించింది. తొలి దశలో రూ. 561 కోట్ల వ్యయంతో నాలుగు బయోగ్యాస్ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు బోర్డు ఆమోదం తెలిపింది. ఈ ప్లాంట్ల ద్వారా దిగుమతి చేసుకునే సీఎన్‌జీకి ప్రత్యామ్నాయం లభిస్తుందని, ఇది పూర్తిగా పునరుత్పాదక ఇంధనమని భార్గవ తెలిపారు. ఈ ప్రాజెక్టుల అనుభవం ఆధారంగా భవిష్యత్తులో మరిన్ని పెట్టుబడులు పెట్టే అవకాశం ఉందని ఆయన సూచించారు.

## దాడిలో చనిపోయి ఉండేదాన్ని

**: మమతా బెనర్జీ**

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రయాణిస్తున్న కారుపై నిరసనకారులు దాడికి పాల్పడ్డారు. కోల్‌కతా సమీపంలోని ఉత్తర 24 పరగణాల జిల్లా హాలిసహర్‌లో ఈ ఘటన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఆమె కాన్వాయ్‌పై కొందరు రాళ్లు, ఇటుకలు, వాటర్ బాటిళ్లు విసిరారు. పోలీసు కస్టడీలో మరణించినట్లు భావిస్తున్న తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) కార్యకర్త బిర్జా కియోట్ కుటుంబాన్ని పరామర్శించేందుకు మమతా బెనర్జీ వెళుతుండగా ఈ సంఘటన చోటుచేసుకుంది. దోపిడీ ఆరోపణలపై అరెస్టయిన బిర్జా, పోలీసుల కస్టడీలో మరణించాడు. ఈ నేపథ్యంలో, మమత పర్యటనను వ్యతిరేకిస్తూ స్థానికులు పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. ఆమె కారును చుట్టుముట్టి, దానిపై బురద పూశారు. "చోర్ భగావో" (దొంగను తరిమేయండి) అంటూ నినాదాలు చేశారు. ఈ దాడిపై మమతా బెనర్జీ తీవ్రంగా స్పందించారు. పోలీసుల సమక్షంలోనే గుర్తుతెలియని వ్యక్తులు తన వాహనంపై రాళ్లతో దాడి చేశారని ఆమె ఆరోపించారు. "కారు అద్దాలు మూసి ఉండటంతో





ప్రాణాలతో బయటపడ్డాను. లేదంటే ఆ రాళ్లు తలకు తగిలి నా తల పగిలిపోయేది" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారని, వారు కేవలం అధికార బీజేపీకి మాత్రమే రక్షణ కల్పిస్తున్నారని మండిపడ్డారు. ఆమెతో పాటు ఉన్న లోక్‌సభ ఎంపీ కల్యాణ్ బెనర్జీ, రాజ్యసభ ఎంపీ డోలా సేన్ కూడా అధికారుల వైఫల్యాన్ని విమర్శించారు. ఈ ఘటనను రాష్ట్ర బీజేపీ చీఫ్ సమీక్ భట్టాచార్య ఖండించారు. ఈ దాడితో తమ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసులను డిమాండ్ చేశారు. అయితే, సీఎం సువేందు అధికారి దీన్ని మమత సృష్టించిన డ్రామాగా అభివర్ణించారు. కస్టడీ మరణాన్ని రాజకీయం చేసేందుకే మమత బలవంతంగా ఆ ప్రాంతానికి వెళ్లారని ఆరోపించారు. మృతుడి కుటుంబ సభ్యులు అధికారుల తీరుపై సంతృప్తి చెందారని, మరణానికి కచ్చితమైన కారణం తెలియాలని మాత్రమే వారు కోరుకుంటున్నారని తెలిపారు. తన పర్యటనతో మమత ప్రజా జీవితానికి ఆటంకం కలిగించారని విమర్శించారు. ఇటీవలే మమత మేనల్లుడు అభిషేక్ బెనర్జీపై కూడా ఆయన నియోజకవర్గంలో దాడి జరిగిన నేపథ్యంలో, తాజా ఘటనతో రాష్ట్రంలో రాజకీయ ఉద్రిక్తతలు మరింత పెరిగాయి.

## సెలవు అడిగితే ఉద్యోగం తీసేశారు

**మైసూరులో యువతి ఆత్మహత్య**



మైసూరు: మైసూరులో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. పై అధికారి వేధింపులు, మితిమీరిన పని ఒత్తిడిని తట్టుకోలేక ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. గత నాలుగు నెలలుగా తనకు కనీసం వారాంతపు సెలవు (వీక్లీ ఆఫ్) కూడా ఇవ్వకుండా వేధించారని ఆరోపిస్తూ ఆమె రాసిన ఆత్మహత్య లేఖ (సూసైడ్ నోట్) ప్రస్తుతం కలకలం రేపుతోంది. మైసూరులోని హినకల్ ప్రాంతంలో శనివారం ఈ ఘటన వెలుగుచూసింది. వివరాల్లోకి వెళితే, నాగేశ్వరి (24) అనే యువతి టాటా సంస్థలో ప్రమోటర్‌గా విధులు నిర్వహిస్తోంది. నాలుగు నెలల క్రితం డాలీ అనే మహిళ సూపర్‌వైజర్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి, తనను లక్ష్యంగా చేసుకుని వేధింపులకు గురిచేస్తున్నారని నాగేశ్వరి తన సూసైడ్ నోట్‌లో పేర్కొంది. గత నాలుగు నెలలుగా ఒక్క వీక్లీ ఆఫ్ కానీ, ఇతర సెలవులు కానీ మంజూరు చేయలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. ఇటీవల అత్యవసర పని నిమిత్తం ఒకరోజు సెలవు కోరగా, అందుకు నిరాకరించడమే కాకుండా తనను ఉద్యోగం నుంచి తొలగించారని ఆమె వాపోయింది. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురైన నాగేశ్వరి బలవన్మరణానికి పాల్పడింది.

## చైనాను వణికిస్తున్న 'డాల్ఫిన్' టైఫూన్

**షాంఘైలో జనజీవనం అస్తవ్యస్తం**

**1300కు పైగా విమాన సర్వీసులు రద్దు**

**తీర ప్రాంతాల నుంచి 3.90 లక్షల మంది తరలింపు**

షాంఘై: పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన అత్యంత తీవ్రమైన 'డాల్ఫిన్' టైఫూన్ చైనా తూర్పు తీరాన్ని అతలాకుతలం చేస్తోంది. గంటకు 160 కిలోమీటర్ల వేగంతో ప్రచండ గాలులతో దూసుకొస్తున్న ఈ తుపాను దెబ్బకు దేశ వాణిజ్య రాజధాని షాంఘై సహా పలు ప్రధాన నగరాలు స్తంభించిపోయాయి. చైనా ప్రభుత్వం ఇప్పటికే బ్లూ అలర్ట్ జారీ చేసి, సహాయక చర్యలను ముమ్మరం చేసింది. తుపాను ప్రభావం షాంఘై, జెజియాంగ్, ఫుజియాన్ ప్రావిన్సులపై తీవ్రంగా పడింది. ముందుజాగ్రత్త చర్యగా షాంఘైలోని హాంకియావో, పుడాంగ్ అంతర్జాతీయ విమానాశ్రయాల్లో ఆదివారం నాటికి 1,300కు పైగా విమాన సర్వీసులను రద్దు చేశారు. ఇది మొత్తం రాకపోకల్లో 60 శాతానికి సమానం. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు, జెజియాంగ్, షాంఘై ఓడరేవులను పూర్తిగా ఖాళీ చేయించడంతో పాటు యాంగ్జీ నదీ పరివాహక ప్రాంతంలో నడిచే పలు రైళ్లు, పడవల సేవలను కూడా నిలిపివేశారు. భారీ వర్షాలు, వరదల ముప్పు పొంచి ఉండటంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. జెజియాంగ్ ప్రావిన్స్‌లోని తైజౌ నగరం, షాంఘై పరిసర లోతట్టు ప్రాంతాల నుంచి సుమారు 3.90 లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. తీర ప్రాంతాల్లోని పాఠశాలలు, వ్యాపార సంస్థలు, పర్యాటక కేంద్రాలకు సెలవులు ప్రకటించారు. చైనా తీరాన్ని తాకడానికి ముందే ఈ డాల్ఫిన్ తుపాను జపాన్‌లోని ఒకినావా దీవులు, తైవాన్ ఉత్తర ప్రాంతాల్లో కుండపోత వర్షాలతో బీభత్సం సృష్టించింది. రానున్న రోజుల్లో ప్రభావిత ప్రాంతాల్లో 200 నుంచి 400 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, ఈ దశాబ్దంలోనే ఇది అత్యంత ప్రమాదకరమైన



తుపానుల్లో ఒకటిగా పరిణమించే ప్రమాదం ఉందని చైనా వాతావరణ కేంద్రం హెచ్చరించింది.

లప్కారి చిత్రం






మహేష్ బాబు బర్త్ డే స్పెషల్..

# వారణాసి సినిమా నుంచి అప్డేట్

**మహేష్ బాబు అభిమానులకు పండుగరోజు. ప్రతి అభిమాని సంబరాలు జరుపుకునే రోజు.. అదే సూపర్ స్టార్ మహేష్ బాబు పుట్టిన రోజు. (ఆగస్టు 9) టాలీవుడ్ స్టార్ మహేష్ బాబు పుట్టినరోజును అభిమానులు ఘనంగా జరుపుకుంటున్నారు. గత వారం రోజుల నుంచే మహేష్ ఫ్యాన్స్ ఆయన పుట్టిన రోజును సెలబ్రేట్ చేసుకుంటూ వస్తున్నారు.**



నేడు.. మహేష్ బాబు అభిమానులకు పండుగరోజు. ప్రతి అభిమాని సంబరాలు జరుపుకునే రోజు.. అదే సూపర్ స్టార్ మహేష్ బాబు పుట్టిన రోజు. (ఆగస్టు 9) టాలీవుడ్ స్టార్ మహేష్ బాబు పుట్టినరోజును అభిమానులు ఘనంగా జరుపుకుంటున్నారు. గత వారం రోజుల నుంచే మహేష్ ఫ్యాన్స్ ఆయన పుట్టిన రోజును సెలబ్రేట్ చేసుకుంటూ వస్తున్నారు. టాలీవుడ్‌లో ప్రిన్స్‌గా, సూపర్ స్టార్ గా పేరు తెచ్చుకున్నాడు మహేష్ . సినిమా ఇండస్ట్రీలో అంచలంచలుగా ఎదుగుతూ తండ్రికి తగ్గ తనయుడిగా పేరుతెచ్చుకున్నాడు. సూపర్ స్టార్ కృష్ణ వారసుడిగా ఇండస్ట్రీలోకి అడుగు పెట్టిన మహేష్ చైల్డ్ ఆర్టిస్ట్ గా సినిమాలు చేశాడు. 1979లో వచ్చిన 'నీడ' సినిమాలో మహేష్ బాబు అతిథి పాత్రలో కనిపించాడు. ఆ తర్వాత కొన్ని సినిమాల్లో చైల్డ్ ఆర్టిస్ట్‌గా కనిపించాడు. 1999లో విడుదలైన 'రాజకుమారుడు' సినిమాతో హీరోగా సినీ రంగ ప్రవేశం చేశాడు. తొలి సినిమాతోనే సూపర్ హిట్ అందుకున్న మహేష్ ఆతర్వాత వరుస సినిమాలతో దూసుకుపోయారు. రాజకుమారుడు తర్వాత మహేష్ బాబు ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించాడు. ఒక్కడు లాంటి ఇండస్ట్రీ హిట్ అందుకున్నాడు. అతడు, పోకిరి, దూకుడు, బిజినెస్ మాన్, సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు, శ్రీమంతుడు, భరత్ అనే నేను ఇలా వరుస హిట్స్ అందుకుంటూ టాలీవుడ్ టాప్ హీరో అయ్యాడు. మహేష్ సినిమాలు రిలీజ్ టైం లోనే కాదు రీ రిలీజ్ ల్లోనూ థియేటర్ల దుమ్ముదులుపుతున్నాయి. సినిమాల్లోనే కాదు రియల్ లైఫ్ లోనూ మహేష్ బాబు సూపర్ స్టారే.. తనదైన శైలి నటనతో నవతరం ప్రేక్షకులను మెప్పిస్తున్న మహేష్ .. ఆయన చేపట్టిన సేవా కార్యక్రమాలు, గుండె సమస్యలతో బాధపడుతున్న చిన్నారులకు శస్త్ర చికిత్సలు చేయిస్తూ ఎంతో మంది గుండెల్లో దేవుడిగా నిలిచారు. మహేష్ బాబు కేవలం నటుడిగానే కాదు నిర్మాతగా, పలు కంపెనీలకు బ్రాండ్ అంబాసిడర్ గా భారీగా సంపాదిస్తున్న మహేష్ బాబు.. తన సంపాదంలో లో 30 శాతం వివిధ సేవలకు ఖర్చు చేస్తారు.మహేష్ బాబు ఏపీ లోని స్వగ్రామమైన బుర్రిపాలెం సహా తెలంగాణ లోని సిద్ధాపురం గ్రామాలను దత్తత తీసుకున్నాడు. ఇక నేడు మహేష్ బాబు పుట్టిన రోజు సందర్భంగా సోషల్ మీడియాలో సెలబ్రెటీలు, ఆయన అభిమానులు, యావత్ ప్రపంచమంతా ఉన్న తెలుగు సినిమా ఆడియన్స్ ఆయనకు విషెస్ తెలుపుతున్నారు.



## కియారాకు యష్ సపోర్ట్

కియారా కష్టపడే తత్వాన్ని యష్ ఆకాశానికి ఎత్తేశాడు. ప్రసంగం మధ్యలో యష్ కియారా పేరు ఎత్తగానే.. ఆడియన్స్ నుంచి ఒక అభిమాని ఆమె నటించిన పాపులర్ పాటను గుర్తుచేస్తూ తబాహి అని గట్టిగా అరిచాడు. దానికి యష్ నవ్వుతూ నిజంగానే తబాహి! అని స్పందించడంతో ఆడిటోరియం అంతా నవ్వులతో నిండిపోయింది. ఆ తర్వాత యష్ మాట్లాడుతూ.. ట్రైలర్‌లో ప్రజలు చూసింది కియారా పాత్ర ఒక చిన్న మెరుపు మాత్రమే. ఈ సినిమా కోసం ఈ నటి చూపించిన అంకితభావం.. పడ్డ కష్టం అసాధారణమైనవి అని కొనియాడారు. సినిమా ట్రైలర్ విడుదలైనప్పటి నుండి కియారా పాత్రపై నెటిజన్లు గుప్పిస్తున్న విమర్శల గురించి యష్ నేరుగా ప్రస్తావించారు. ఒక నటిగా నువ్వు కొన్ని అనవసరమైన విమర్శలను ఎదుర్కోవాల్సి రావడం దురదృష్టకరం. కానీ ఆ నెగెటివిటీని నువ్వు అసలు పట్టించుకోవద్దు! నీ పనిని నువ్వు నమ్ముకో.. తప్పకుండా ప్రేక్షకులు నిన్ను కొనియాడతారు. మనం కాలం కంటే కాస్త ముందున్నాం.. త్వరలోనే జనాలు దీని విలువ తెలుసుకుంటారు అని పేర్కొన్నాడు.

## కెరీర్‌పై కామెంట్స్.. కీర్తి సురేష్ బోల్డ్ రిప్లై

నేచురల్ స్టార్ నాని నటిస్తున్న భారీ చిత్రం 'ది ప్యారడైజ్'లో కీర్తి సురేష్ ఒక ప్రత్యేక డ్యాన్స్ నంబర్ చేస్తోందని, మంచి ఆఫర్లు లేకపోవడం వల్లే ఈ నిర్ణయం తీసుకుందంటూ సోషల్ మీడియాలో ట్రోల్స్ వచ్చాయి. అయితే, ఈ వార్తలపై సీరియస్ అవ్వకుండా కీర్తి సురేష్ చాలా చాకచక్యంగా, హ్యూమరస్ స్టైల్‌లో తమిళంలో ఇచ్చిన కౌంటర్ రిప్లై ఇచ్చింది. 'వేరే లెవల్ పొంగ! చిన్న కరెక్షన్.. నాని నటిస్తున్నది తెలుగు సినిమా, కన్నడ కాదు' అని తమిళంలో కామెంట్ పెట్టింది. ఇక ఆమె ఇచ్చిన ఈ సెటైరికల్ కౌంటర్‌కు ఫ్యాన్స్ ఫిదా అయిపోయి, నవ్వుల ఎమోజీలతో సోషల్ మీడియాను ఊపేస్తున్నారు.





## వామిక గబ్బి.. హీరోలను డామినేట్ చేసే పెర్ఫార్మెన్స్

విలక్షణ దర్శకుడిగా తన మార్క్ టేకింగ్ తో అందరి దృష్టిని ఆకట్టుకున్న ప్రముఖ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ హీరోగా మారి ఇటీవల నటించిన తొలి చిత్రం డీసీ. ఆగస్టు 7వ తేదీన థియేటర్లలో విడుదలైంది. ఇందులో చంద్ర అనే పాత్రలో నటించింది బాలీవుడ్ బ్యూటీ వామిక గబ్బి. అయితే తాజాగా ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాగా సినిమాలో ఈమె నటనను చూసి ప్రేక్షకులు ఈమెపై ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈమె క్యారెక్టర్, నటన సినిమాకే హైలెట్ అని , కొన్ని చోట్ల లోకేష్ ను డామినేట్ చేసి నటించింది అంటూ తెగ పొగిడేస్తున్నారు.



## అల్లు అర్జున్‌కు డై హార్డ్ ఫ్యాన్‌ను

హీరోయిన్ మమిత బైజు కూడా తాజాగా తన ఫేవరెట్ హీరో గురించి చెప్పి అభిమానులను సర్ప్రైజ్ చేసింది. విశ్వనాథ్ అండ్ సన్స్ ప్రమోషన్స్‌లో భాగంగా.. తాను అల్లు అర్జున్ కు డైహార్డ్ ఫ్యాన్ అని, ఆయన సినిమాలను రిపీట్ మోడ్లో చూస్తూ ఉంటాను అంటూ అల్లు అర్జున్ పై తన ఇష్టాన్ని పంచుకుంది. ముఖ్యంగా బన్నీ స్టైల్ అంటే చాలా ఇష్టమని, ఆయనను ఎప్పుడూ ఫాలో అవుతానని కూడా తెలిపింది.

## ఫ్యాన్‌గర్ల్‌గా వచ్చా



రాకింగ్ స్టార్ యష్ కథానాయకుడిగా.. క్రియేటివ్ డైరెక్టర్ గీతూ మోహన్‌దాస్ రూపొందించిన ప్రతిష్ఠాత్మక చిత్రం టాక్సిక్: ఎ ఫెయిరీ టెల్ ఫర్ గ్రోన్-అప్స్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ బెంగళూరులో ఎంతో వైభవంగా జరిగింది. ఈ వేడుకలో కథానాయిక రుక్మిణి వసంత్ తెర వెనుక రాత్రింబవళ్లు శ్రమించిన ప్రొడక్షన్ యూనిట్, కెమెరామెన్, సాంకేతిక బృందానికి వేదికపై నుంచి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఒక నటిగా తనకు దక్కిన గుర్తింపునకు కారణం ఈ సాంకేతిక నిపుణుల శ్రమేనని గుర్తించిన తీరు తనలోని సంస్కారాన్ని, ప్రొఫెషనలిజాన్ని చాటిచెప్పింది. ఈ వినయపూర్వక వైఖరే నెటిజన్ల నుండి గొప్ప ప్రశంసలు తెచ్చిపెట్టింది. మాతృభాషాభిమానాన్ని చాటుకుంటూ సొంత ఊరిలో జరిగిన ఈ వేడుకలో రుక్మిణి కన్నడలోనే మాట్లాడి స్థానిక ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నారు. యష్ స్టార్‌డమ్ ని కీర్తించిన రుక్మిణి.. ఒక ఫ్యాన్‌గర్ల్‌గా వచ్చాను.. సినిమాలో భాగం చేసారు.. అంటూ రుక్మిణి ఎమోషనల్ అయ్యారు.



## యువతకు కోహ్లీ రోల్ మోడల్: వీవీఎస్

టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఒక అద్భుతమైన ప్రొఫెషనల్ క్రీడాకారుడు అని, యువ క్రికెటర్లకు గొప్ప ఆదర్శప్రాయుడని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ) హెడ్ వీవీఎస్ లక్ష్మణ్ ప్రశంసల వర్షం కురిపించాడు. కోహ్లీ తన కోసం తాను నిర్దేశించుకున్న అత్యున్నత ప్రమాణాలను అందుకునేందుకు నిరంతరం కష్టపడతాడని, అతని అంకితభావం ఎందరికో స్ఫూర్తినిస్తోందని లక్ష్మణ్ పేర్కొన్నాడు. చాలా మంది యువ ఆటగాళ్లు కోహ్లీని అనుసరించాలని అనుకుంటున్నారని, అతనిలా రాణించాలని కోరుకుంటున్నారని వివరించాడు. ఇదే సమయంలో, ఇటీవలి కాలంలో భారత ఆటగాళ్లు వరుసగా గాయాల బారిన పడటంతో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌పై వస్తున్న విమర్శలపైనా లక్ష్మణ్ స్పందించాడు. జస్‌ప్రీత్ బుమ్రా, సాయి సుదర్శన్, హర్షిత్ రాణా, నితీశ్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్ వంటి కీలక ఆటగాళ్లు గాయపడటంపై మాట్లాడుతూ, గాయాలు క్రికెటర్ల కెరీర్‌లో ఒక భాగమని, వాటిని పూర్తిగా నివారించలేమని స్పష్టం చేశాడు. ఈ విషయంలో సీఓఈని నిందించడం సరికాదని, ఆటగాళ్ల పనిభారాన్ని జాగ్రత్తగా పర్యవేక్షించడం, సరైన నిర్వహణపై దృష్టి పెట్టడం ముఖ్యమని తెలిపాడు.








### సిరాజ్ సిక్సర్ల హ్యాట్రిక్..

# వార్మప్ మ్యాచ్‌లో భారత్ విక్టరీ

**పేసర్ మహమ్మద్ సిరాజ్ బౌలర్‌గానే కాకుండా బ్యాటర్‌గానూ విధ్వంసం సృష్టించాడు. ఆఖరి ఓవర్లో వరుసగా మూడు సిక్సర్లు బాది శ్రీలంక క్రికెట్ ఎలెవన్‌తో జరిగిన మూడు రోజుల వార్మప్ మ్యాచ్‌లో భారత్‌కు 6 వికెట్ల తేడాతో ఉత్కంఠ విజయాన్ని అందించాడు. ఈ విజయంతో టెస్ట్ సిరీస్‌కు ముందు టీమిండియా ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసుకుంది.**

**ఆదివారం ముగిసిన ఈ మ్యాచ్‌లో 207 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్, ఒక దశలో చివరి రెండు ఓవర్లలో 23 పరుగులు చేయాల్సిన క్లిష్ట పరిస్థితిలో నిలిచింది. ఈ సమయంలో క్రీజులో ఉన్న సిరాజ్ తనలోని పవర్ హిట్టర్‌ను బయటకు తీశాడు.**

44వ ఓవర్లో ఒక సిక్సర్ బాదిన అతను, ఆఖరి ఓవర్లో వరుసగా మూడు బంతులను స్టాండ్స్‌లోకి పంపి మరో మూడు బంతులు మిగిలి ఉండగానే మ్యాచ్‌ను ముగించాడు. సిరాజ్ కేవలం 15 బంతుల్లోనే 32 పరుగులు చేసి అజేయంగా నిలవడం విశేషం. లక్ష్య ఛేదనలో ఓపెనర్ యశస్వి జైస్వాల్ (61) అర్ధ శతకంతో రాణించి జట్టుకు గట్టి పునాది వేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో డకౌట్ అయిన జైస్వాల్, ఈసారి ఆత్మవిశ్వాసంతో ఆడి రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. గాయం కారణంగా తొలి రెండు రోజులు ఆటకు దూరమైన కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (44) తిరిగి బరిలోకి దిగి రాణించడం భారత్‌కు సానుకూలాంశం. అయితే, రిషభ్ పంత్ (28), ధ్రువ్ జురెల్ (12) తక్కువ స్కోర్లకే పరిమితమయ్యారు. ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా (22) మరోసారి వేగంగా పరుగులు చేశాడు. అంతకుముందు, భారత బౌలర్లు రెండో ఇన్నింగ్స్‌లోనూ రాణించారు. యువ పేసర్ గుర్నూర్ బ్రార్ (2/38) తన బౌన్స్‌తో ఆకట్టుకోగా, రవీంద్ర జడేజా (2/33) రెండు కీలక వికెట్లు పడగొట్టాడు. సిరాజ్, ప్రసిధ్ కృష్ణ తలో వికెట్ తీశారు. శ్రీలంక ఎలెవన్ జట్టులో నిషాన్ మధుష్క (63) మరోసారి అర్ధ శతకంతో రాణించగా, ఆ జట్టు 200/6 వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. మొత్తంగా ఈ వార్మప్ మ్యాచ్ భారత జట్టుకు మంచి ప్రాక్టీస్‌ను అందించింది. కీలక బ్యాటర్లు ఫామ్ అందుకోవడం, బౌలర్లు లయ సాధించడంతో జట్టు పూర్తి ఆత్మవిశ్వాసంతో ఉంది. ఇరు జట్ల మధ్య రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లో భాగంగా తొలి టెస్ట్ ఆగస్టు 15న గాలే వేదికగా ప్రారంభం కానుంది.

**శ్రీలంక క్రికెట్-11 మొదటి ఇన్నింగ్స్: 363/8 డిక్లేర్డ్, రెండో ఇన్నింగ్స్: 200/6 డిక్లేర్డ్ (నిషాన్ మధుష్క 63, నిపున్ ధనంజయ 46; రవీంద్ర జడేజా 2-33, గుర్నూర్ బ్రార్ 2-37)**

**భారత్ మొదటి ఇన్నింగ్స్: 357/6 డిక్లేర్డ్, రెండో ఇన్నింగ్స్: 214/4 (45 ఓవర్లలో) (యశస్వి జైస్వాల్ 61, శుభ్‌మన్ గిల్ 44; కేశర నువంతా 2-57, విశ్వ ఫెర్నాండో 1-34)**

## వైభవ్ అచ్చం ధోనీలానే: ఊతప్ప

టీమిండియా టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ బ్యాటింగ్ అచ్చం దిగ్గజ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ తరహాలోనే ఉందని మాజీ క్రికెటర్ రాబిన్ ఊతప్ప అన్నాడు. వైభవ్ సూర్యవంశీ సరికొత్త బ్యాటింగ్ టెక్నిక్‌ను పరిచయం చేశాడని, ధోనీ కూడా ఈ టెక్నిక్‌తోనే ఆడేవాడని గుర్తు చేశాడు. తాజాగా ఓ యూట్యూబ్ ఛానెల్‌తో మాట్లాడిన రాబిన్ ఊతప్ప.. వైభవ్ సూర్యవంశీ క్రీజులో డీప్‌గా బ్యాక్‌ఫుట్‌లో ఆఫ్‌స్టంప్‌కు కొద్దిగా బయటకు నిలబడి ఆడుతాడని, ధోనీ అప్రోచ్ కూడా ఇలానే ఉండేదని తెలిపాడు. 'వైభవ్ సూర్యవంశీ విభిన్నమైన బ్యాటింగ్ టెక్నిక్‌ను అనుసరిస్తున్నాడు. ఇతర ఆటగాళ్లు కూడా ఫాలో అయ్యే బ్యాటింగ్ టెక్నిక్‌ను అతను కనుగొన్నాడు. అతను ఎక్కువగా ఫ్రంట్ ఫుట్‌కి వెళ్లకుండా బ్యాక్ ఫుట్‌లోనే ఉండి ఆడుతాడు. ఎంఎస్ ధోనీ కూడా ఇలానే ఆడేవాడు. బంతి కిందికి వచ్చే విధంగా బ్యాక్‌ఫుట్‌లో వేచి చూసి ఆడేవాడు. యార్కర్ బాల్స్‌ను భారీ షాట్స్‌గా ఆడాలంటే బ్యాటర్లకు ఉన్న ఏకైక ఆప్షన్ ఇదే. వైభవ్ సూర్యవంశీ కొద్దిగా వంగి.. ఆఫ్‌స్టంప్‌కు కొంచెం బయట నిలబడుతాడు. తద్వారా బౌలర్ గుడ్ లెంగ్త్ బాల్ లేదా షార్ట్ పిచ్, బౌన్సర్ వేయాలని ఎదురు చూస్తుంటాడు. దాంతో బౌలర్లు ఏ ప్రదేశంలో బాల్ వేసినా.. అతనికి పరుగులు చేయడం సునాయసం అవుతుంది. కాబట్టి వైభవ్ పరిచయం చేసిన ఈ బ్యాటింగ్ టెక్నిక్‌ను యువ క్రికెటర్లు సునాయసంగా అనుకరించవచ్చు. అలవర్చుకోవచ్చు.'అని రాబిన్ ఊతప్ప అభిప్రాయపడ్డాడు.




### భారతకు వైభవ్ ఆణిముత్యం: బ్రెట్ లీ

భారత యువ క్రికెట్ సంచలనం వైభవ్ సూర్యవంశీపై ఆస్ట్రేలియా మాజీ దిగ్గజ పేసర్ బ్రెట్ లీ ప్రశంసల వర్షం కురిపించాడు. వైభవ్ వయసు చుట్టూ జరుగుతున్న చర్చ అనవసరమని, అతనిలో అపారమైన ప్రతిభ ఉందని, భారత క్రికెట్‌కు సుదీర్ఘకాలం సేవలు అందించగలడని అభిప్రాయపడ్డాడు. ఇటీవలే 'బీర్ బైసెప్స్' అనే యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడుతూ బ్రెట్ లీ ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. "భారత్ బయట, ప్రపంచవ్యాప్తంగా అందరూ వైభవ్ వయసు నిజంగా 15 ఏళ్లేనా? అని చర్చించుకుంటున్నారు. ప్రస్తుతం ఇదే అతిపెద్ద టాకింగ్ పాయింట్. కానీ, అతడి వయసు ఎంతైతే నాకేంటి? 15 అయినా, 17 లేదా 18 అయినా పర్వాలేదు. ఈ కుర్రాడు అద్భుతంగా క్రికెట్ ఆడగలడు.

## లక్నో ఆటగాళ్లపై ముంబై కన్ను!

ఐపీఎల్ 2026 సీజన్‌లో ముంబై ఇండియన్స్ దారుణంగా విఫలమైంది. టైటిల్ ఫేవరేట్‌గా బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్ 14 మ్యాచ్‌ల్లో పదింటిలో ఓడి తీవ్రంగా నిరాశపర్చింది. దాంతో పాయింట్స్ టేబుల్‌లో 9వ స్థానంతో సరిపెట్టుకుంది. ఐదు సార్లు ఛాంపియన్ అయిన ముంబై ఇండియన్స్‌కు ఇది ఏ మాత్రం స్థాయికి తగ్గ ప్రదర్శన కాదు. జట్టు నిండా స్టార్లు ఉన్నా.. అంచనాలకు తగ్గట్లు రాణించలేకపోయింది. బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్ వైఫల్యం ముంబై పతనాన్ని శాసించింది. ఈ ఘోర పరాజయాన్ని సీరియస్‌గా తీసుకున్న ముంబై ఇండియన్స్.. వచ్చే సీజన్‌లో టైటిల్ గెలవడమే లక్ష్యంగా జట్టును సిద్ధం చేస్తోంది. జట్టును వీడాలని నిర్ణయించుకున్న కెప్టెన్ హార్దిక్ పాండ్యాను అడ్డుపెట్టుకొని తమకు కావాల్సిన ఆటగాళ్లను ఇతర జట్ల నుంచి ట్రేడ్ చేసుకునేందుకు ప్రయత్నాలను ప్రారంభించింది. ఇప్పటికే సీఎస్కే, కేకేఆర్‌తో ట్రేడ్ డీల్ గురించి చర్చలు జరిపిన ముంబై ఇండియన్స్.. ఇతర ఫ్రాంచైజీలను కూడా సంప్రదించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా లక్నో సూపర్ జెయింట్స్‌కు చెందిన ప్రిన్స్ యాదవ్, మొహసిన్ ఖాన్‌తో పాటు నికోలస్ పూరన్‌లపై ముంబై కన్నేసినట్లు తెలుస్తోంది. హార్దిక్ పాండ్యాను ఇచ్చి ఈ ముగ్గురి ఆటగాళ్లను జట్టులోకి తెచ్చుకోవాలనే ప్రయత్నాల్లో ముంబై ఉన్నట్లు సమాచారం.

## జైస్వాల్ కెరీర్‌ను కాపాడా: రహానే

భారత యువ సంచలనం యశస్వి జైస్వాల్ కెరీర్ ఆరంభంలోనే ఒక పెద్ద శిక్ష నుంచి ఎలా తప్పించుకున్నాడో సీనియర్ ఆటగాడు అజింక్యా రహానే తాజాగా వెల్లడించాడు. 2022 దులీప్ ట్రోఫీ ఫైనల్‌లో జైస్వాల్‌పై నాలుగు మ్యాచ్‌ల నిషేధం పడకుండా తాను ఎలా అడ్డుపడ్డానో రహానే వివరించాడు. 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్'కు ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో రహానే ఆనాటి ఘటనను గుర్తు చేసుకున్నాడు. వెస్ట్ జోన్ కెప్టెన్‌గా ఉన్న తాను, సౌత్ జోన్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పాడు. మ్యాచ్ సందర్భంగా యశస్వి జైస్వాల్, సౌత్ జోన్ బ్యాటర్ టి. రవి తేజను పదేపదే స్లెడ్జింగ్ చేశాడు. అంపైర్లు హెచ్చరించినా జైస్వాల్ తన ప్రవర్తన మార్చుకోలేదు. దీంతో పరిస్థితి చేయిదాటిపోతుందని భావించిన రహానే, కెప్టెన్‌గా జోక్యం చేసుకున్నాడు. "నేను జైస్వాల్‌ను కాసేపు మైదానం విడిచి బయటకు వెళ్లమని చెప్పాను. ప్రశాంతంగా ఆలోచించుకుని మళ్లీ రమ్మని సూచించాను. నా చర్యను చూసిన మ్యాచ్ రిఫరీ వి. నారాయణన్ కుట్టి, అప్పటికే సిద్ధం చేసిన నాలుగు మ్యాచ్‌ల నిషేధ లేఖను చించివేశారు" అని రహానే తెలిపాడు. ఆ సమయంలో తన నిర్ణయం జైస్వాల్‌కు బాధ కలిగించినా, అది అతని కెరీర్‌ను కాపాడిందని రహానే అభిప్రాయపడ్డాడు. కాగా, అదే మ్యాచ్‌లో జైస్వాల్ 265 పరుగులు చేసి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. వెస్ట్ జోన్ ఆ ట్రోఫీని గెలుచుకుంది. ఆ తర్వాత 2023లో జైస్వాల్ భారత జట్టులోకి అరంగేట్రం చేశాడు.





## సచిన్ ఆల్ టైం గ్రేటెస్ట్

క్రికెట్ ప్రపంచంలో తరచుగా వినిపించే "ఆల్‌టైమ్ గ్రేటెస్ట్ ప్లేయర్ (గోట్)" ఎవరు అనే చర్చపై ఆస్ట్రేలియా దిగ్గజ పేసర్ బ్రెట్ లీ తన అభిప్రాయాన్ని కుండబద్దలు కొట్టినట్లు చెప్పాడు. దక్షిణాఫ్రికా స్టార్ ఆల్‌రౌండర్ జాక్వెస్ కలిస్‌తో పోలుస్తూ అడిగిన ప్రశ్నకు, తన దృష్టిలో భారత మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కరే ఎప్పటికీ అత్యుత్తమ క్రికెటర్ అని స్పష్టం చేశారు. మాజీ క్రికెటర్లు స్కాట్ స్టైరిస్, పార్థివ్ పటేల్‌లతో కలిసి పాల్గొన్న ఒక పాడ్‌కాస్ట్‌లో బ్రెట్ లీ ఈ వ్యాఖ్యలు చేశారు. జాక్వెస్ కలిస్ గణాంకాలు అద్భుతమైనవని ఆయన అంగీకరించాడు. టెస్టుల్లో 13,000కు పైగా పరుగులు, 292 వికెట్లు, వన్డేల్లో 11,000కు పైగా పరుగులు, 270కి పైగా వికెట్లతో కలిస్ గొప్ప ఆల్‌రౌండర్ అని కొనియాడాడు. "కానీ, ఇద్దరిలో ఒక్కరిని మాత్రమే ఎంచుకోవాల్సి వస్తే, నేను కచ్చితంగా సచిన్ టెండూల్కర్‌నే ఎంచుకుంటాను" అని లీ తేల్చిచెప్పాడు.

ఈవార్తలు
# ప్రజావాణి
సోమవారం 10-8-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు


నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

## పోరాడే ప్రతిపక్షమే ప్రజాస్వామ్యానికి బలం

ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం ఎంత ముఖ్యమో.. ప్రతిపక్షం కూడా అంతే ముఖ్యం. ప్రభుత్వం పాలిస్తుంది. ప్రతిపక్షం ప్రశ్నిస్తుంది. ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుంది. ప్రతిపక్షం వాటి ప్రభావాలను ప్రజల తరఫున పరిశీలిస్తుంది. ప్రభుత్వం తప్పు చేస్తే ఎత్తిచూపడం, ప్రజలకు ఇచ్చిన హామీలను గుర్తుచేయడం, విధానాలపై ప్రత్యామ్నాయాలను సూచించడం ప్రతిపక్షం ప్రధాన బాధ్యత. ప్రతిపక్షం బలంగా ఉంటేనే ప్రభుత్వం మరింత అప్రమత్తంగా పనిచేస్తుంది. తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం కనిపిస్తున్న పరిణామాలు ఈ ప్రజాస్వామ్య సూత్రాన్ని మరోసారి చర్చకు తెస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాలనపై విమర్శలు, హామీల అమలుపై ప్రశ్నలు, ప్రజా సమస్యలపై ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఇక్కడ ఒక విషయాన్ని స్పష్టంగా చెప్పాలి. ప్రతిపక్షం ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టడం కోసం కాదు.. ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీగా ఉండేలా చేయడం కోసం పోరాడాలి. ఆ ప్రమాణాన్ని అందుకుంటేనే ప్రతిపక్ష రాజకీయాలకు గౌరవం లభిస్తుంది. ప్రజాస్వామ్యంలో ఎన్నికల్లో ఓడిపోవడం అంటే ప్రజల నుంచి పూర్తిగా దూరమైపోవడం కాదు. అధికారంలో లేని పార్టీకి కూడా ప్రజల సమస్యలపై మాట్లాడే బాధ్యత ఉంటుంది. అసెంబ్లీలో ప్రశ్నించడం, ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలో పోరాటాలు చేయడం, ప్రభుత్వ విధానాల్లో లోపాలను ఎత్తిచూపడం, ప్రజలకు ఇచ్చిన హామీలను గుర్తుచేయడం.. ఇవన్నీ ప్రతిపక్ష ధర్మంలో భాగమే. ఈ విషయంలో బీఆర్ఎస్ ఇటీవలి కాలంలో అనుసరిస్తున్న వ్యూహాన్ని కేవలం రాజకీయ పోరాటంగా మాత్రమే చూడటం సరిపోదు. ప్రభుత్వాన్ని ప్రజల ముందు జవాబుదారీగా నిలబెట్టే ప్రయత్నంగా కూడా చూడాలి. ముఖ్యంగా రైతులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, విద్యార్థులు, పెన్షనర్లు, సంక్షేమ పథకాల లబ్ధిదారుల సమస్యలపై ప్రభుత్వం స్పందించేలా ఒత్తిడి తీసుకురావడం ప్రతిపక్షానికి అవసరమైన పని. ప్రతిపక్షం అంటే అధికార పార్టీ చేసే ప్రతి పనినీ వ్యతిరేకించడం కాదు. ప్రజలకు ఉపయోగపడే నిర్ణయాలను సమర్థించడం, తప్పులను విమర్శించడం, అవసరమైనప్పుడు ప్రత్యామ్నాయాన్ని చూపించడం కూడా ప్రతిపక్ష బాధ్యతే. ప్రభుత్వం ఏ మంచి కార్యక్రమం చేపట్టినా కేవలం రాజకీయ కారణాలతో దాన్ని వ్యతిరేకిస్తే ప్రజలు కూడా ఆ విమర్శలను అంతగా స్వీకరించరు. అదేవిధంగా, గతంలో అధికారంలో ఉన్న పార్టీగా బీఆర్ఎస్ కూడా తన పాలనపై ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత నుంచి తప్పించుకోలేదు. గత ప్రభుత్వ నిర్ణయాలపై ప్రజల్లో ఉన్న అనుమానాలు, వివాదాలు, ఆర్థిక భారం, అమలు లోపాలపై కూడా ఆ పార్టీ ఆత్మపరిశీలన చేసుకోవాలి. ప్రతిపక్షంగా విశ్వసనీయత పొందాలంటే గత పాలనకు కూడా సమాధానం చెప్పగల నైతిక ధైర్యం అవసరం. ఇక్కడ కాంగ్రెస్ ప్రభుత్వానికీ ఒక కీలక సందేశం ఉంది. ప్రతిపక్షం ప్రశ్నిస్తోందని అసహనపడాల్సిన అవసరం లేదు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నలు రావడం ప్రభుత్వానికి ప్రమాదం కాదు. ప్రశ్నలకు సమాధానాలు లేకపోవడమే అసలు ప్రమాదం. బీఆర్ఎస్ చేస్తున్న ప్రతి విమర్శను రాజకీయ కుట్రగా కొట్టిపారేయడం కంటే, అందులో వాస్తవం ఎంత ఉందో ప్రభుత్వం పరిశీలించాలి. ఒక సమస్యపై ప్రతిపక్షం పోరాడితే ప్రజల్లో అసంతృప్తి ఉందా అని ప్రభుత్వం తెలుసుకోవాలి. హామీ అమలులో ఆలస్యం ఉంటే కారణం చెప్పాలి. నిర్ణయం తీసుకోలేని పరిస్థితి ఉంటే ప్రజలకు వాస్తవ పరిస్థితిని వివరించాలి. అలా చేస్తే ప్రతిపక్ష పోరాటం ప్రభుత్వాన్ని బలహీనపరచదు. మరింత మెరుగైన పాలన వైపు నడిపిస్తుంది.

# సుస్థిర భవిష్యత్తు వైపు యూపీఐ

**భారత ఆర్థిక వ్యవస్థను ఆధునిక సాంకేతికతతో అనుసంధానించి, నగదు రహిత లావాదేవీల్లో ప్రపంచానికి మార్గదర్శకంగా నిలిచిన ఏకీకృత చెల్లింపుల వ్యవస్థ (యూపీఐ) ఇప్పుడు కీలక మలుపు వద్ద నిలిచింది. కోట్లాది మంది భారతీయుల దైనందిన జీవితంలో అంతర్భాగంగా మారిన ఈ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను దీర్ఘకాలికంగా నిర్వహించేందుకు అవసరమైన నిధుల సమీకరణపై కేంద్రం దృష్టి సారిస్తోంది. యూపీఐ లావాదేవీలపై భవిష్యత్తులో అవసరమైతే నామమాత్రపు రుసుములు లేదా వర్తకులపై చెల్లింపు రుసుము విధించే అవకాశం కల్పించేలా లోక్‌సభలో చట్ట సవరణకు ఆమోదం లభించడం ఈ చర్చకు మరింత ప్రాధాన్యత తెచ్చింది. అయితే చట్ట సవరణ ఆమోదం పొందినంత మాత్రాన తక్షణమే ప్రతి యూపీఐ లావాదేవీపైనా రుసుములు అమల్లోకి వస్తాయని భావించడం సరికాదు. ఏ తరహా లావాదేవీలకు, ఎంత మేరకు రుసుములు విధించాలన్న అంశంపై భవిష్యత్తులో ప్రభుత్వం నిబంధనలు రూపొందించేందుకు ఇది కేవలం చట్టపరమైన వెసులుబాటును కల్పిస్తుంది.**




యూపీఐ ప్రయాణం నిజంగా భారత డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో ఒక విప్లవం. 2016 ఏప్రిల్‌లో భారత జాతీయ చెల్లింపుల సంస్థ ఆధ్వర్యంలో కేవలం 21 బ్యాంకులతో ప్రారంభమైన ఈ వ్యవస్థ తొలినాళ్లలో బ్యాంకుల మధ్య నగదు బదిలీకి ఉపయోగపడే సాధనంగానే కనిపించింది. అయితే 2016 నవంబర్‌లో నోట్ల రద్దు, ఆ తర్వాత చౌకైన అంతర్జాలం, స్మార్ట్‌ఫోన్ల విస్తరణ యూపీఐకి అపూర్వమైన వేగాన్ని అందించాయి. కూరగాయల విక్రేత నుంచి పెద్ద వ్యాపార సంస్థ వరకు, టీ దుకాణం నుంచి సూపర్ మార్కెట్ వరకు, పెట్రోల్ బంకు నుంచి ఆసుపత్రి వరకు.. విద్యుత్, గ్యాస్ బిల్లుల నుంచి ప్రభుత్వ పన్నుల చెల్లింపుల వరకు యూపీఐ ప్రతి రంగంలోకి విస్తరించింది. నేడు నెలకు వేల కోట్ల లావాదేవీలు యూపీఐ ద్వారా జరుగుతున్నాయి. ప్రపంచ రియల్‌టైమ్ డిజిటల్ చెల్లింపుల్లో భారతదేశం అగ్రస్థానంలో నిలవడానికి యూపీఐ కీలక కారణంగా మారింది.

యూపీఐ ఇంతటి ప్రజాదరణ పొందడానికి ప్రధాన కారణాల్లో ఒకటి వినియోగదారులు, చిన్న వ్యాపారులపై ప్రత్యక్ష రుసుము లేకపోవడం. డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించడంతో పాటు నగదు వినియోగాన్ని తగ్గించేందుకు కేంద్రం 2020 జనవరి నుంచి యూపీఐ, రూపే డెబిట్ కార్డు లావాదేవీలపై 'శూన్య వర్తక రుసుము' విధానాన్ని అమలు చేసింది. సాధారణంగా కార్డు ద్వారా జరిగే చెల్లింపులపై వ్యాపారులు కొంత శాతం రుసుమును చెల్లించాల్సి ఉంటుంది. కానీ యూపీఐ విషయంలో ఈ రుసుము లేకపోవడంతో చిన్న వ్యాపారులు కూడా ఎలాంటి అదనపు భారం లేకుండా సంకేత చతురస్రం ద్వారా చెల్లింపులు స్వీకరించడం ప్రారంభించారు. దీంతో డిజిటల్ చెల్లింపులు కేవలం పట్టణాలకు పరిమితం కాకుండా గ్రామీణ ప్రాంతాలకూ విస్తరించాయి. అయితే ప్రతి విజయానికి ఒక వ్యయభారం ఉంటుంది. యూపీఐ లావాదేవీలు విపరీతంగా పెరిగిన కొద్దీ వాటిని నిర్వహించేందుకు అవసరమైన సాంకేతిక మౌలిక వసతుల వ్యయం కూడా పెరుగుతోంది. భారీ సమాచార నిల్వ కేంద్రాలు, సైబర్ భద్రత, మోసాల నివారణ వ్యవస్థలు, నిరంతర నెట్‌వర్క్ నిర్వహణ, సాంకేతిక సామర్థ్యాల పెంపు వంటి వాటికి బ్యాంకులు, డిజిటల్ చెల్లింపు సంస్థలు భారీగా పెట్టుబడులు పెట్టాల్సి వస్తోంది. ఇప్పటివరకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహక నిధులు ఈ మొత్తం వ్యయాన్ని పూర్తిగా భర్తీ చేయడం సాధ్యపడటం లేదు. దీంతో యూపీఐ వ్యవస్థను దీర్ఘకాలికంగా ఎలా నిర్వహించాలనే ప్రశ్న ముందుకు వచ్చింది. ఇక్కడే 'ఉచిత సేవ' నుంచి 'స్వీయ పోషణ' వైపు యూపీఐ ప్రయాణం ప్రారంభమవుతోంది.

భవిష్యత్తులో రుసుములు అమల్లోకి వస్తే అవి అందరికీ ఒకే విధంగా ఉండకూడదు. ఇదే అత్యంత కీలకమైన అంశం. వ్యక్తి నుంచి వ్యక్తికి జరిగే చిన్న మొత్తాల బదిలీలు, సామాన్య వినియోగదారుల రోజువారీ చెల్లింపులు, చిన్న వీధి వ్యాపారుల లావాదేవీలను రుసుముల పరిధి నుంచి మినహాయించాల్సిన అవసరం ఉంది. పెద్ద సంస్థలు, భారీ వాణిజ్య లావాదేవీలు, అధిక విలువ కలిగిన వ్యాపార చెల్లింపులపైనే పరిమిత స్థాయిలో రుసుములు విధించే విధానం ఆలోచించవచ్చు. అలా చేస్తే సామాన్యుడిపై భారం పడకుండా యూపీఐ వ్యవస్థకు అవసరమైన ఆర్థిక స్థిరత్వాన్ని కల్పించవచ్చు. యూపీఐ విజయానికి సాంకేతికత ఎంత ముఖ్యమో.. ప్రజల విశ్వాసం అంతకంటే ముఖ్యమైనది. చిన్న మొత్తాల చెల్లింపులకు కూడా రుసుములు విధించడం ప్రారంభిస్తే డిజిటల్ చెల్లింపులపై వినియోగదారుల ప్రవర్తనలో మార్పులు వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా నగదు నుంచి డిజిటల్ చెల్లింపుల వైపు మారిన చిన్న వ్యాపారులు తిరిగి నగదు లావాదేవీల వైపు వెళ్లే పరిస్థితి రాకూడదు. అందుకే ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా అది పారదర్శకంగా, దశలవారీగా, ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఉండాలి.

యూపీఐని ఎప్పటికీ పూర్తిగా ప్రభుత్వ ప్రోత్సాహక నిధులపైనే నడపడం సాధ్యం కాకపోవచ్చు. అదే సమయంలో దాని ఆర్థిక భారాన్ని పూర్తిగా ప్రజలపై మోపడం కూడా సమంజసం కాదు. అందువల్ల పెద్ద వ్యాపార లావాదేవీల నుంచి పరిమిత రుసుముల వసూలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, సాంకేతిక వ్యయాల నియంత్రణ, మోసాల నివారణలో మెరుగైన వ్యవస్థలు.. ఇలా అనేక మార్గాలను సమన్వయం చేయాల్సి ఉంటుంది. యూపీఐని కేవలం చెల్లింపుల సాధనంగా కాకుండా దేశ డిజిటల్ ప్రజా మౌలిక వసతిగా చూడాలి. దాని విస్తరణతో పాటు భద్రత, వేగం, విశ్వసనీయత, అందుబాటు కూడా నిరంతరం మెరుగుపడాలి. లోక్‌సభ ఆమోదించిన చట్ట సవరణను తక్షణ రుసుముల విధింపుగా చూడాల్సిన అవసరం లేదు. ఇది భవిష్యత్తులో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను ఆర్థికంగా సుస్థిరంగా నిర్వహించేందుకు ప్రభుత్వానికి కల్పించిన ఒక వెసులుబాటు. ఇప్పుడు అసలు పరీక్ష ప్రభుత్వం ముందుంది. ప్రజల ప్రయోజనాలు, చిన్న వ్యాపారుల రక్షణ, బ్యాంకులు--చెల్లింపు సంస్థల ఆర్థిక స్థిరత్వం, సాంకేతిక మౌలిక వసతుల నిర్వహణ.. ఈ నాలుగు అంశాల మధ్య సమతుల్యత సాధించాలి. యూపీఐ భారతదేశం ప్రపంచానికి అందించిన అద్భుతమైన డిజిటల్ ఆవిష్కరణ. దాని విజయాన్ని కేవలం లావాదేవీల సంఖ్యతో కొలవకూడదు. సామాన్యుడికి ఎంత సులభంగా, భద్రంగా, తక్కువ ఖర్చుతో డిజిటల్ ఆర్థిక వ్యవస్థను అందించగలిగామన్నదే అసలు ప్రమాణం.



**రామకిష్టయ్య సంగనభట్ల**
సీనియర్ స్వతంత్ర పాత్రికేయుడు,
కాలమిస్టు, 9440595494




# సైబర్ వల.. జర పైలం బిడ్డా!

డిజిటల్ యుగంలో సైబర్ నేరగాళ్లు మోసాలకు కొత్త మార్గాలను ఎంచుకుంటున్నారు. బ్యాంకు ఖాతాలు, ఓటీపీలు, పెట్టుబడుల పేరుతో సాగిన మోసాల తర్వాత ఇప్పుడు సోషల్ మీడియా ఆకర్షణలను ఆయుధంగా మార్చుకుంటున్నారు. తాజాగా 'రెంట్ ఫర్ బాయ్‌ఫ్రెండ్' పేరుతో ప్రచారం అవుతున్న ఆఫర్లపై హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ హెచ్చరిక చేయడం ఈ కొత్త తరహా సైబర్ మోసాల తీవ్రతను తెలియజేస్తోంది. సోషల్ మీడియాలో అందమైన యువకుల ఫొటోలు, స్టైలిష్ వీడియోలు, గంటల వారీ ప్యాకేజీలు, ప్రత్యేక డిస్కౌంట్ల పేరుతో ప్రకటనలు కనిపిస్తున్నాయి. 'డైరెక్ట్ మెసేజ్ చేయండి' అంటూ యువతులను వ్యక్తిగత చాటింగ్‌లోకి తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతోంది. తొలిచూపులో ఇవి నిజమైన సేవల ప్రకటనలుగా కనిపించినా, వాటి వెనుక ఉన్న వ్యక్తి ఎవరు? ప్రొఫైల్‌లోని ఫొటోలు నిజమైనవేనా? అనే విషయాలు నిర్ధారించుకోకుండా స్పందించడం ప్రమాదకరం.

మొదట స్నేహపూర్వకంగా మాట్లాడి నమ్మకం కలిగిస్తారు. ఆ తర్వాత ఫోన్ నంబర్, వ్యక్తిగత వివరాలు, ఫొటోలు లేదా ఇతర సమాచారాన్ని సేకరించే అవకాశం ఉంది. 'బుకింగ్ ఫీజు', 'రిజిస్ట్రేషన్', 'సెక్యూరిటీ డిపాజిట్' వంటి పేర్లతో డబ్బులు అడగవచ్చు. ఒకసారి చెల్లింపు చేసిన తర్వాత కొత్త కారణాలు చెప్పి మరిన్ని డబ్బులు డిమాండ్ చేసే ప్రమాదం ఉంది. బాధితురాలు నిరాకరిస్తే వ్యక్తిగత ఫొటోలు బయటపెడతామని, కుటుంబ సభ్యులకు పంపుతామని బెదిరించే స్థాయికి మోసం వెళ్లవచ్చు. బ్లాక్‌మెయిల్‌కు భయపడి డబ్బులు చెల్లించడం పరిష్కారం కాదు. వెంటనే పోలీసులను ఆశ్రయించడమే సరైన మార్గం.

'రెంట్ ఫర్ బాయ్‌ఫ్రెండ్' వంటి ఆకర్షణీయమైన సోషల్ మీడియా ఆఫర్ల పట్ల యువతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ సూచించారు. తల్లిదండ్రులు కూడా పిల్లల సోషల్ మీడియా వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని ఆయన హెచ్చరించారు. అనుమానాస్పద పరిచయాలు లేదా మోసాలు ఎదురైతే భయపడకుండా వెంటనే పోలీసులను ఆశ్రయించాలని, అవసరమైతే 1930 జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. సోషల్ మీడియాలో కనిపించే ప్రతి అందమైన ఫొటో నిజమైన వ్యక్తిదని భావించకూడదు. తెలియని వ్యక్తులకు ఆధార్, పాన్, బ్యాంకు వివరాలు, ఓటీపీ, పాస్‌వర్డ్ వంటి సున్నితమైన సమాచారాన్ని ఇవ్వకూడదు. వ్యక్తిగత ఫొటోలు, వీడియోలను పంపడంలోనూ అత్యంత జాగ్రత్త అవసరం. ముఖ్యంగా ముందస్తు చెల్లింపులు చేయడానికి ముందు ఆ సేవ నిజమైనదా? సంస్థకు విశ్వసనీయమైన గుర్తింపు ఉందా? అనే విషయాలను పరిశీలించాలి. పిల్లలు ఏ సోషల్ మీడియా వేదికలు ఉపయోగిస్తున్నారు? ఎలాంటి పరిచయాలు ఏర్పడుతున్నాయి? అనే విషయాలపై తల్లిదండ్రులకు అవగాహన ఉండాలి. అనుమానాస్పద పరిస్థితి ఎదురైనా పిల్లలు భయపడకుండా చెప్పేలా స్నేహపూర్వక వాతావరణం కల్పించాలి.

సైబర్ మోసానికి గురైనప్పుడు పరువు పోతుందనే భయంతో మౌనం వహించకూడదు. చాటింగ్ వివరాలు, ఫోన్ నంబర్లు, ప్రొఫైల్ లింకులు, స్క్రీన్‌షాట్లు, చెల్లింపు వివరాలను భద్రపరచాలి. డబ్బు బదిలీ జరిగితే ఆలస్యం చేయకుండా 1930కు ఫిర్యాదు చేయాలి. అవసరమైతే జాతీయ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చు. సైబర్ నేరగాళ్లు ఇప్పుడు ప్రేమ, స్నేహం, ఆకర్షణ వంటి భావోద్వేగాలను కూడా మోసాలకు ఉపయోగిస్తున్నారు. అందుకే సోషల్ మీడియాలో కనిపించే ప్రతి ఆఫర్‌ను నమ్మడం ప్రమాదకరం. 'రెంట్ ఫర్ బాయ్‌ఫ్రెండ్' పేరుతో వచ్చే ఆకర్షణీయమైన ప్రకటనలకు మోసపోవద్దు. ఆకర్షణ కంటే అప్రమత్తత ముఖ్యం. భయపడటం కాదు.. ఫిర్యాదు చేయడమే ధైర్యం. ఒక్క క్లిక్‌కు ముందు ఒక్కసారి ఆలోచించండి. సైబర్ మోసాలను అడ్డుకోవడంలో పోలీసులతో పాటు ప్రజల అప్రమత్తతే తొలి రక్షణ కవచం.



**శ్రీశైలం దూడం**
ఫ్రీలాన్స్ జర్నలిస్ట్, 9133947176

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.